ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 8 నవంబరు 2024





ఫామ్‌లో ఇంజనీర్

- ఉద్యోగం వదిలి కోళ్ల పెంపకం చేపట్టిన యువకుడు
- సొంతూరిలో మూడు ఎకరాల్లో ఫామ్ ఏర్పాటు
- ఒక్కో కోడి పుంజు రూ.10 వేలు నుంచి రూ.30 వేల వరకు విక్రయం

· 8లో

రెండు జిల్లాల్లో 544 గ్రామాలకు నాణ్యమైన విద్యుత్

- కలెక్టర్ విజయకృష్ణన్
- నర్సీపట్నంలో 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం
- అమరావతి నుంచి వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన
- రూ.67.35 కోట్లతో ఏడాదిలో నిర్మాణం పూర్తి



విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపన శిలాఫలం ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, అధికారులు

నర్సీపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో రూ.67.35 కోట్లతో చేపడుతున్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం అమరావతి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవం, 12 సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపన చేయగా, వీటిలో నర్సీపట్నం కూడా వుంది. విద్యుత్ శాఖ అధికారులు బలిఘట్టంలోని 133/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు నిర్వహించిన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చేశారు. శంకుస్థాపన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న 133/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అదనంగా 220 కేవీ స్థాయికి పెంచడం వల్ల జిల్లాలోని ఆరు మండలాల్లో 175 గ్రామాలకు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మూడు మండలాల్లో 369 గ్రామాలకు విద్యుత్ సంబంధ సమస్యలు తొలగుతాయని చెప్పారు. ఆయా గ్రామాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని అన్నారు. 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ఏడాదిలో పూర్తవుతాయని ఆమె చెప్పారు.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి ఫలితంగానే 220 కేవీ సబ్ స్టేషన్ మంజూరైందని తెలిపారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగడం వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. మాకవరపాలెంలో 300 ఎకరాల ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలు స్థాపనకు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, ఎం.రామరాజు, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, ఈపీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బి.శ్యామ్ ప్రసాద్, ఎస్‌ఈలు కె.నరసింహారావు, పి.ప్రభాకర్, ఈఈ రామకృష్ణ, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి సూర్యచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా గ్రావెల్, మట్టి తవ్వకాలు



కొప్పాకలోని ఏపీఐఐసీ ప్రాంగణంలో గ్రావెల్ తవ్వకాలు

- ఏపీఐఐసీ, కేంద్రీయ విద్యాలయం భూముల్లో దర్జాగా తవ్వకాలు
- స్థానికులు ఫిర్యాదు చేసినా తూతూమంత్రంగా చర్యలు
- మొక్కుబడిగా జరిమానాలు విధించి వదిలేస్తున్న వైనం

అక్రమార్కులకు స్థానిక నేతల అండ



అనకాపల్లి మండలం అచ్చియ్యపేటలో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన భూముల్లో గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గోతులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఐదు నెలలు కావస్తున్నప్పటికీ సహజ వనరుల దోపిడీ యథావిధిగానే కొనసాగుతున్నది. ఏ పార్టీ అధికారంలో వున్నప్పటికీ అక్రమార్కుల దందా మాత్రం ఆగడంలేదు. ఎవరు అధికారంలో వుంటే.. వాళ్లతో సన్నిహితంగా వుంటూ ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, లేఅవుట్‌లలో మెరక పనులకు గ్రావెల్, మట్టి తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో సహజ వనరులను యథేచ్ఛగా దోచుకున్నారు. గనుల శాఖ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా, సీనరేజ్ చెల్లించకుండా మట్టి, గ్రావెల్‌ను భారీఎత్తున తవ్వుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సహజ వనరుల దోపిడీకి చెక్ పడుతుందని ప్రజలు భావించారు. కానీ ఎక్కడా మార్పు కనిపించడం లేదు. అధికారంలో వున్న పార్టీల నాయకుల సహకారంతో మట్టి, గ్రావెల్ అక్రమల తవ్వకాలు, రవాణాను ఎప్పటిలానే కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఎక్కడా మట్టి, గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని గనుల శాఖ అధికారులు చెబుతుండగా, అనకాపల్లి మండలం కొప్పాక, సత్యనారాయణపురం, సబ్బవరం మండలం గంగవరం, నంగినారపాడు, గొల్లలపాలెం, తదితర గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా, అధికారుల దాడుల నుంచి తప్పించుకునేందుకు రాత్రి పది గంటల తరువాత ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తవ్వి, భారీ డంపర్ లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకల్లా తవ్వకాలు, రవాణాను ఆపేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలింపు

అనకాపల్లి, కశింకోట, పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. ఇంకా పరిశ్రమలు ఏర్పాటవుతూనే వున్నాయి. ఈ మండలాలతోపాటు జాతీయ రహదారి పక్కనున్న కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేస్తున్నారు. లేఅవుట్‌లను ఎత్తు చేయడానికి, అంతర్గత రోడ్ల నిర్మాణానికి పెద్ద మొత్తంలో గ్రావెల్, మట్టి అవసరం. అక్రమార్కులు ఆయా రియల్ ఎస్టేట్ వ్యాపారులను సంప్రదించి గ్రావెల్ లేదా మట్టి సరఫరాకు ఒప్పందం చేసుకుంటున్నారు. దూరాన్నిబట్టి ట్రాక్టర్ గ్రావెల్ రూ.3-4 వేలు, లారీ అయితే రూ.6-8 వేలు వసూలు చేస్తున్నారు. ఇందులో సగం సొమ్ము గ్రావెల్ తవ్వకాలు, రవాణాకుపోను మిగిలిన సగం సొమ్ము అక్రమార్కులకు మిగులుతున్నది. రూపాయి కూడా పెట్టుబడి లేకుండా ఇబ్బడి ముబ్బడిగా ఆదాయం వస్తుండడంతో అక్రమార్కులు ఎక్కడపడితే అక్కడ గ్రావెల్ తవ్వేస్తున్నారు. గతంలో కొంతమంది వైసీపీ నాయకులు, వీరితో చేతులు కలిపి భారీ మొత్తంలో కూడబెట్టుకున్నారు. అక్రమార్కులు ఇప్పుడు కూటమి పార్టీలకు చెందిన కిందిస్థాయి నాయకులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకుని గ్రావెల్, మట్టి తవ్వకాలు, రవాణా చేస్తున్నారు.

ఏపీఐఐసీ, సెంట్రల్ స్కూల్ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు

అనకాపల్లి మండలం కొప్పాకలోని ఏపీఐఐసీ పరిశ్రమల కేంద్రంలోని ఒక బ్లాక్‌లో గత వారం రోజులుగా గ్రావెల్ తవ్వకాలు జరిపి సమీపంలోని ఒక పౌల్ట్రీఫామ్‌కు తరలిస్తున్నారు. మార్టూరులో సర్వే నంబరు ఒకటిలోని ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు జరిపి జాతీయ రహదారికి సమీపంలో ఒక ప్రముఖ సంస్థ చేపడుతున్న నిర్మాణాలకు తరలిస్తున్నారు. అనకాపల్లి మండలం సీతానగరం రెవెన్యూ పరిధిలోని సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో సర్వే నంబరు 511లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం గతంలో 10 ఎకరాలను కేటాయించింది. ఇక్కడ రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్వి, లారీల్లో ... మిగతా 8వ పేజీలో

చిన్నారుల ప్రాణాలకు ముప్పు

- అసంపూర్తిగా నాడు-నేడు భవనాలు
- కిటికీలు, తలుపులు అమర్చకుండానే తరగతులు నిర్వహణ
- పై అంతస్థు కావడంతో విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం
- బెంచీలు సైతం సమకూర్చని వైనం
- విద్యార్థులు నేలపైనే కూర్చోవాల్సిన దుస్థితి
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంపై తల్లిదండ్రులు ఆగ్రహం



ప్రమాదకరంగా ఏఎల్‌పురం హైస్కూల్ అదనపు తరగతి గదులు

తరగతి గదులకు కిటికీలు ఏర్పాటు చేయకపోవడంతో బయటకు వంగి చూస్తున్న విద్యార్థులు

కృష్ణాదేవిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): **గొలుగొండ మండలం ఏఎల్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రమాదకర పరిస్థితుల మధ్య విద్యార్థులు చదువు కొనసాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం కింద చేపట్టిన పనులను అసంపూర్తిగా వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. నాలుగు తరగతులను పై అంతస్థులో కిటికీలు, తలుపులేని గదుల్లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఎవరైనా కిటికీల వద్దకు వచ్చి, పొరపాటున వంగితే కిందపడే ప్రమాదం వుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.**



బెంచీలు లేకపోవడంతో నేలపై కూర్చుని పాఠాలు వింటున్న మూడో తరగతి విద్యార్థులు

ఏఎల్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వాస్తవంగా రెండేళ్ల క్రితం వరకు ఇక్కడ ఆరు నుంచి పదో తరగతి వరకు వుండేవి. గత ప్రభుత్వం నూతన విద్యా విధానం అమలు పేరుతో ఒక కిలోమీటరు పరిధిలో వున్న ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసింది. వీరు సుమారు 200 మంది వరకు వుంటారు. పెరిగిన విద్యార్థులకు సరిపడ వసతి లేకపోవడంతో వరండాల్లో తరగతులు నిర్వహించే వారు. ఈ సమస్య విద్యా శాఖ అధికారుల దృష్టికి రావడంతో నాడు-నేడు కార్యక్రమం రెండో విడతలో నాలుగు తరగతి గదుల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అప్పటికే వున్న భవనాల మీద మరో అంతస్థు నిర్మించడానికి రూ.90 లక్షలు మంజూరయ్యాయి. ఏడాది క్రితం నిర్మాణ పనులు పూర్తిచేశారు. కానీ కిటికీలు, తలుపులు బిగించలేదు. విద్యార్థులకు బెంచీలు సమకూర్చలేదు. వీటిని అమరావతి నుంచి ప్రభుత్వం నేరుగా సరఫరా చేస్తుందని అధికారులు చెప్పడంతో అసంపూర్తిగా వున్న గదుల్లోనే 3, 4, 5, 6 తరగతులను నిర్వహిస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరం ముగిసినప్పటికీ ప్రభుత్వం నుంచి కిటికీలు, తలుపులు, ఫ్యాన్లు రాలేదు. వేసవి సెలవుల్లో సాధారణ ... మిగతా 8వ పేజీలో

అసంపూర్తి భవనాలకు కదలిక

వివరాలు సేకరిస్తున్న పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు

- వైసీపీ హయాంలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లకు భవనాలు మంజూరు
- బిల్లులు సరిగా చెల్లించకపోవడంతో అసంపూర్తిగా వదిలేసిన కాంట్రాక్టర్లు
- నిర్మాణ పనుల పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం చర్యలు



అనకాపల్లి మండలం రేబాకలో అసంపూర్తిగా వున్న ఆర్‌బీకే భవనం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వైసీపీ హయాంలో చేపట్టి, బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌సెంటర్ల భవన నిర్మాణాలకు త్వరలో మోక్షం కలగనున్నది. ఏ భవనానికి ఎంత ఖర్చు చేశారు, ఇంకా చెల్లించాల్సింది ఎంత, పనుల స్థితిగతులపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నివేదిక రూపొందించే పనిలో వున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లకు సొంత గూడు సమకూర్చే ఉద్దేశంతో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. భవన నిర్మాణాలకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్టు ప్రకటనలు కూడా చేశారు. కానీ భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో చాలా వరకు నిర్మాణ పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కొన్నిచోట్ల వైసీపీ నాయకులే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి భవన నిర్మాణాలు చేపట్టకుండానే బిల్లు డ్రా చేసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి.

జిల్లాలో గ్రామ/ వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని 2020లో భావించిన ప్రభుత్వం ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నుంచి నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవనం రూ.40 లక్షల అంచనాతో పనులు ప్రారంభించారు. సుమారు 820 భవనాలకు రూ.328 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. కానీ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో ఎక్కడికక్కడ పనులు ఆపేశారు. మరోవైపు కొన్ని మండలాల్లో వైసీపీ నాయకులు ... మిగతా 8వ పేజీలో

మూన్నాళ్ల ముచ్చటే!



హరిపాలెం-కొండకర్ల మధ్య లేచిపోయిన తారు లేయర్

అధ్వానంగా అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డు

- రహదారి అభివృద్ధిని విస్మరించిన వైసీపీ పాలకులు
- ఎన్నికల ముందు హడావుడిగా గోతులు పూడ్చివేత
- నాణ్యతాలోపంతోపాటు నాసిరకంగా పనులు
- భారీ వాహనాలతో ఛిద్రమవుతున్న రహదారి
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



హరిపాలెంలో మరమ్మతు పనులు చేసినచోట కుంగిన రోడ్డు



అధిక బరువుతో వెళుతున్న టిప్పర్ లారీ

అచ్యుతాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాల రాకపోకలతో అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డు నానాటికీ అధ్వానంగా తయారవుతున్నది. ఇటీవల తారు, పిక్కతో కప్పిన గోతుల వద్ద పరిస్థితి మళ్లీ మొదటికొస్తున్నది. రోడ్డు విస్తరణ పేరుతో వైసీపీ వైసీపీ అధికారంలో వున్న ఐదేళ్ల కాలంలో కనీస నిర్వహణ పనులు చేపట్టలేదు. దీంతో అడుగడుగునా గోతులు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాంబిల్లి మండలంలో ఏర్పాటవుతున్న ప్రత్యామ్నాయ నేవల్ బేస్‌తోపాటు అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో కంపెనీలు, పరిశ్రమల నిర్మాణానికి అవసరమైన సామగ్రి, యంత్ర పరికరాలను ... మిగతా 8వ పేజీలో

మండల పరిషత్‌ను తనిఖీ చేసిన జడ్పీ సీఈవో



మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో నారాయణమూర్తి

నక్కపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి గురువారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో డి. సీతారామరాజు మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, సర్వ సభ్య సమావేశాల్లో చేసిన తీర్మానాలు తదితర అంశాల గురించి వివరించారు. మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పంచాయతీల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జడ్పీ సీఈవో ఆదేశించారు. ఇప్పటికే పంచాయతీ సెక్రటరీలతో సమీక్ష జరిపామని, ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేపడుతున్నామని ఎంపీడీవో చెప్పారు.

'అభిజిత్' సమస్య మూడు రోజుల్లో పరిష్కరించకుంటే ఉద్యమం

▸▸ సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అచ్యుతాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అధికారులతోపాటు కాంట్రాక్టర్లు ఇచ్చిన హామీ మేరకు మూడురోజుల్లో అభిజిత్ లేఆఫ్ సమస పరిష్కరించకపోతే సోమవారం నుంచి ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. గురువారం అభిజిత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికుల నుద్దేశించి ఆయన ప్రసంగించారు. అభిజిత్ లేఆఫ్ సమస్యపై తాము లేబర్ డెవలప్‌మెంట్ కమిషనర్‌తోపాటు అభిజిత్ కాంట్రాక్టర్లతో చర్చలు జరిపామని, మూడు రోజుల్లో కార్మికులకు జీతాలు, బోనస్‌లు కూడా ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అందువల్ల తాము సోమవారం వరకు నిరసన కార్యక్రమాలను నిలిపేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.రాము, కె.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో కేన్సర్ నుంచి రక్షణ

▸▸ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి



పాయకరావుపేటలో కేన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పాయకరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు పరీక్షల ద్వారా కేన్సర్ నుంచి రక్షణ పొందవచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి తెలిపారు. గురువారం జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అందరికీ కేన్సర్ పరీక్షలు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన వారికి కేన్సర్ ప్రిలిమినరీ పరీక్షలు ఇంటి వద్దనే వైద్య సిబ్బంది చేయాలన్నారు. అనుమానితులను గుర్తించి రిఫర్ చేయాలని సూచించారు. అంతకుముందు పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి పీహెచ్‌సీలో వివిధ విభాగాలను పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందులు, వైద్య పరికరాలు తదితర అంశాలపై వైద్యాధికారులతో చర్చించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ డి.సుభాష్, డాక్టర్ వీఎస్.సౌందర్య, డాక్టర్ పద్మావతి(ఆయుష్షు), ఎంపీహెచ్ఈఓ పీవీ.రమణ, ఎంపీహెచ్ఎస్ ఎం.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

అందరికీ కేన్సర్ పరీక్షలు అన్న అంశంపై గురువారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈనెల 14 నుంచి 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి కేన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు కె.శ్రావ్య, జి.వి జయకుమార్, టి.పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వైద్యాధికారి మానస ఆధ్వర్యంలో హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలో అవగాహన కార్యక్రమం జరిగింది.

ఎస్.రాయవరంలో..

మండలంలోని సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ వాసంతి, డాక్టర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో గురువారం జాతీయ కేన్సర్ అవగాహన ర్యాలీలు కార్యక్రమాలు నిర్వహించారు. ఊబకాయం, నోటి లంగ్, పాంక్రియాస్, పేగు, రొమ్ము, గర్భసంచి, ప్రొస్టేట్, లివర్, బ్రెయిన్ చర్మ క్యాన్సర్, బ్లడ్ కేన్సర్ వంటి రోగాల బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెండు పీహెచ్‌సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

▸▸ టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం



ప్రహారీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అమలకంటి అబద్ధం

ఎస్.రాయవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం అన్నారు. మండలంలోని వాకపాడు ఎంపీపీ స్కూల్ ప్రహారీ గోడ నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తుంపాల నాగేశ్వరరావు, రమణ, బుల్లిదొర, గణేష్, ఉపాధ్యాయులు తోట బంగారమ్మ, యడ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

స్కూలులో అస్వస్థతకు గురైన హెచ్‌ఎం

▸▸ ఆస్పత్రికి తరలింపు

ఎలమంచిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్ బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హిమబిందు గురువారం సాయంత్రం అస్వస్థతకు గురవ్వడంతో తోటి ఉపాధ్యాయినిలు సమీపంలోని సీహెచ్‌సీకి తరలించగా వైద్య సేవలు అందించారు. ఈ సంఘటన తెలుసుకున్న పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఓ విలేకరి హెచ్‌ఎంకు స్కూలు వివరాలు తీసుకున్న కొద్దిసేపటికి హెచ్‌ఎం అస్వస్థతకు గురయ్యారని ఉపాధ్యాయులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



కాలు పెట్టలేని దుస్థితిలో ఉన్న ధర్మవరం వారపు సంత



అపరిశుభ్ర వాతావరణంలో సంతలోని దుకాణ సముదాయం

చినుకు పడితే చింతే..

▸▸ సంతలో అడుగు పెట్టలేని పరిస్థితి

▸▸ అపరిశుభ్రత.. తీవ్ర దుర్వాసన

▸▸ ఇదీ ధర్మవరం వారపు సంత దుస్థితి

▸▸ ఏటా లక్షలాది రూపాయల ఆదాయం

▸▸ అయినా.. నిర్వహణపై కన్నెత్తి చూడని మునిసిపల్ అధికారులు

ఎలమంచిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అది పట్టణంలో ప్రధాన వారపు సంత.. సాధారణ రోజుల్లో అపరిశుభ్రంగా ఉంటూ దుర్వాసన వస్తుంది. అదే చినుకు పడితే సంతలో అడుగు పెట్టలేని దుస్థితి ఉంటుంది. ఏటా లక్షలాది రూపాయల ఆదాయం వచ్చే ధర్మవరం సంత నిర్వహణపై మునిసిపాలిటీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పట్టణవాసులు విమర్శిస్తున్నారు.

పట్టణంలోని ధర్మవరం వారపు సంత నిర్వహణపై మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సంతకు వచ్చే వందలాది మంది వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. స్వచ్ఛతా హీ సేవ అంటూ పరిసరాల్లో స్వచ్ఛత సేవా కార్యక్రమాలు చేపడుతున్న మునిసిపల్ అధికారులకు కార్యాలయం పక్కనే ఉన్న ఈ వారపు సంతలో దుస్థితి ఎందుకు కనిపించడం లేదంటూ పలువురు పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. ధర్మవరం వారపు సంతలో చినుకు పడితే చాలు అడుగు పెట్టలేని విధంగా తయారవుతుంది. అపరిశుభ్ర వాతావరణం, పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, తీవ్ర దుర్వాసన నడుమ వారపు సంత సాగుతుంది. మునిసిపాలిటీకి ఆదాయ వనరుల్లో ఒక్కటైన వారపు సంత నిర్వహణ పట్ల ప్రజారోగ్య శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సుమారు పదేళ్ల క్రితం స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ. 19 లక్షలు వెచ్చించి వారపు సంత గేట్లు, ప్రహారీ గోడ నిర్మించారు. సంత ఆవరణలో అరకొరగా షెడ్లు నిర్మించి నిర్వహణ గాలికొదిలేశారు. దీంతో వారపు సంత ఆవరణంతా బురదమయంగా తయారైంది. సంత పరిసర ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉంటూ దుర్వాసన వెదజల్లుతున్నది. ఈ దుర్వాసన భరించలేని కొందరు వ్యాపారులు సంత ఆవరణలో కాకుండా రోడ్డు పక్కనే దుకాణాలను పెట్టుకుంటున్నారు. అదే చినుకు పడితే చాలు కాలు పెట్టలేని విధంగా తయారవుతుంది. గురువారం మాత్రమే నిర్వహించే ఈ వారపు సంతలో దుకాణాలు నిర్వహణ ద్వారా ఏటా లక్షలాది రూపాయలు ఆదాయం మునిసిపాలిటీకి చేకూరుతుంది. అయినా సరే ఈ వారపు సంత నిర్వహణ పట్ల శ్రద్ధ చూపకపోవడం విశేషం. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకునైనా మునిసిపల్ అధికారులు వారపు సంతలో కనీస మౌలిక వసతులు కల్పించి అటు వ్యాపారులకు, ఇటు వినియోగదారులకు మేలు చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

▸▸ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు గురువారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే, విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. స్కూలు పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. కొందరు విద్యార్థినులు నేలపై కూర్చోవడాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులను ప్రశ్నించగా.. ఫర్నీచర్ కొరత, వసతి సమస్య కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. అనంతరం విద్యార్థినులతో కొంతసేపు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం వంటలు, కోడిగుడ్లను పరిశీలించి, రుచికరంగా వండాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సుందరపు సూచించారు. పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం స్కూలు రికార్డులను పరిశీలన చేశారు. స్కూలులో వసతి, తదితర సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు, ఎంఈఓ అరుణ్‌కుమార్, కూటమి నేతలు బొద్దపు శ్రీను, మాజీ సర్పంచ్ లవుడు లోవరాజు, ఆడారి రమణబాబు, ఎస్. చిట్టిబాబు, కరణం రవి పాల్గొన్నారు.



స్కూలులో మధ్యాహ్న భోజన పథకం వంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

నేడు పలు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో వార్షిక నిర్వహణలో భాగంగా పట్టణంలో వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఆరు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక రాజుగారిబీడు, మన్నా పబ్లిక్ స్కూల్, కంటోన్మెంట్ ఏరియా, మంగవరం రోడ్డు, తానావారి వీధి, ముస్లింవీధి, చాకలిపేట, నాగరాజుపేట, మెయిన్‌రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అచ్యుతాపురంలో..

మండలంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున శుక్రవారం పలు గ్రామాల్లో ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు దిబ్బపాలెం (సెజ్ పునరావాస కాలనీ), భోగాపురం, జంగులూరు, దుప్పితూరు, కోనెంపాలెం, కుమారపురం, ఇండస్ట్రీయల్ ఏరియా, మార్టూరు, లంక ధర్మవరం, గొర్లె ధర్మవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలమంచిలి పట్టణం, కొత్త ఎర్రవరం, లైనుకొత్తూరు, సోమన్నపాలెం, కట్టుపాలెం, కొత్తపాలెం, సోమలింగపాలెం, రామారాయుడుపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని తెలిపారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి మృతి

అచ్యుతాపురం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రవరం గ్రామంలో కొల్లేటి తాతారావు (79) గడ్డి మందు తాగి మృతి చెందారని స్థానిక సీఐ నమ్మి గణేష్ తెలిపారు. ఎనిమిది నెలల క్రితం తాతారావు భార్య చనిపోవడంతో ఒంటరితనానికి లోనైన తాతారావు మంగళవారం ఇంటిలో ఉన్న గడ్డి మందును మద్యం అనుకొని తాగాడన్నారు. వెంటనే స్థానికులు తాతారావును అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారన్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడన్నారు. తాతారావుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. కుమారుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గణేష్ తెలిపారు..

టపాసు పేలి విద్యార్థికి గాయాలు

ఎలమంచిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్‌లో గురువారం సాయంత్రం టపాసులు కాల్చుతుండగా పదో తరగతి విద్యార్థి చేతికి గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. వైద్య సిబ్బంది సేవలందించి ఇంటికి పంపించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

▸▸ ఇంటర్వ్యూలకు 857 మంది హాజరు

▸▸ 273 మందికి ఉద్యోగ అవకాశాలు

నర్సీపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాల ఆవరణలో 857 మంది నిరుద్యోగ యువతీ యువకులు పేర్లు నమోదు చేసుకున్నారు. అరబిందో ఫార్మా, డెక్కన్ కెమికల్స్, గ్లాండ్ ఫార్మా, అపోలో ఫార్మసీ, ఫ్యూచర్ ప్రోపర్టీ గ్రూప్, టీవీఎస్ తదితర పదిహేను కంపెనీలకు సంబంధించిన హెచ్‌ఆర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించి, 273 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజుతో పాటు ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలుష్య జలాలపై అధికారుల విచారణ

అచ్యుతాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పూడిమడకలో కాలుష్యం గురించి మత్స్య, పర్యావరణ శాఖల అధికారులు గురువారం విచారణ జరిపారు. సెజ్ కర్మాగారాల్లో వ్యర్థాలు వదిలేయడం వల్ల పూడిమడక చుట్టుపక్కల ఉన్న కాలువలు, ఉప్పుటేరు కలుషితంగా మారి చేపలు చనిపోతున్నాయని పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీనికి తోడు మత్స్యకార నాయకుడు చేపల తాతలు లిఖిత పూర్వకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై పొల్యూషన్ బోర్డు అధికారులు, మత్స్యశాఖ అధికారులు నీటి నమూనాలు సేకరించారు. అలాగే సెజ్‌లో గల వశిష్ట, జీఎంపీఎస్ కర్మాగారాలను పరిశీలించారు. అక్కడ నీటి నమూనాలు సేకరించారు. నమూనాల నివేదికలు ఆధారంగా కర్మాగారాలకు నోటీసులు జారీ చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సంచాలకులు పి.ప్రసాద్, ఏడీ జాస్మిన్, మండల మత్స్యశాఖ అధికారి రవితేజ, పర్యావరణ శాఖ ఇంజనీర్ ముకుందరావు బృందం పాల్గొన్నారు.

రీ సర్వే భూ సమస్యల పరిష్కార సభలను వినియోగించుకోవాలి



గ్రామ సభలో అర్జీలు స్వీకరిస్తున్న డీటీ ఆనంద్

పాయకరావుపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామసభలను రైతు లు వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ జి. ఆనంద్ అన్నారు. మండలంలోని నామవరంలో గురువారం నిర్వహించిన రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో భూముల విస్తీర్ణంలో ఎటువంటి తేడాలున్నా, ఫొటో మిస్ మ్యాచింగ్ అయినా, గ్రామ సభలో అర్జీలు ఇస్తే 15 రోజులలో వాటిని పరిష్కరిస్తామన్నారు. గ్రామసభలో రైతుల నుంచి 44 అర్జీలను స్వీకరించినట్టు ఆయన తెలిపారు. వీటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సీతారాంపురం సర్పంచ్ పి. వెంకటకృష్ణ, ఆర్.ఐ త్రినాద్, వీఆర్‌వోలు, రైతులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్య విధానంపై శిక్షణ



ఆయుష్ కరపత్రాలు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

ఎలమంచిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ వైద్య విధానంపై ఆశ కార్యకర్తలతోపాటు వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని ఆయుష్ వైద్యులు సౌభాగ్యలక్ష్మి అన్నారు. గురువారం పెదపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందికి ఆయుష్ వైద్య విధానంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయుష్ వైద్య విధానాలైన ఆయుర్వేదం, హోమియో, యునాని, సిద్ధ, నేచురోపతి వైద్య విధానంలో అనుసరించాల్సిన విధానాలను వైద్య సిబ్బందికి వివరించారు. గృహ వైద్యం ఇంటింటా అందరికీ అందేలా ఈ శిక్షణలో సూచించారు. ఈ కార్యక్రమంలో 32 మంది ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.

సీఐటీయూ నేత రమేష్‌కు ఘన నివాళులు

అచ్యుతాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దివంగత సీఐటీయూ నేత ఎస్.రమేష్ ఏడో వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ చేసిన సేవలను నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండల కేంద్రంలో దివంగత సీఐటీయూ నాయకుడు ఎస్.రమేష్ 7వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. రమేష్ చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ చిట్టివలస జ్యూట్, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపైన, ఎస్ఈజెడ్, నేవీ నిర్వాసితుల సమస్యలపైన ఆయన పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు చందక రామకృష్ణ, వై.రాము, డి.కాశియ్య, సీహెచ్ పవన్‌కుమార్, బి. అప్పారావు, లక్ష్మణ్, సన్యాసిరావు, ఐద్వా నాయకురాలు నూకరత్నం పాల్గొన్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

▸▸ టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు



అరట్లకోటలో సభ్యత్వ నమోదుపై ఆరా తీస్తున్న చిట్టిబాబు

పాయకరావుపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. మండలంలోని అరట్లకోటలో బుధవారం రాత్రి నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీవిశ్వనాథ్, కట్టా శ్రీను, వేములపూడి అప్పారావు, అప్పారావు, లక్ష్మణారావు, దొరబాబు పాల్గొన్నారు.

పూడిమడకలో..

అచ్యుతాపురం: మండలంలోని పూడిమడకలో సభ్యత్వ నమోదు చురుగ్గా జరుగుతోందని టీడీపీ సీనియర్ నాయకుడు మేరుగు బాపునాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి సభ్యత్వాలు తీసుకోడానికి యువకులు ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కంబాల రాజు, వాసుపల్లి బండియ్య, కొవిరి దుర్గారావు, చోడిపల్లి ఎర్రయ్య తాత, కొవిరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు నీటితో ఇబ్బందులు



కుమారపురంలో రోడ్డుపై చేరిన మురుగునీరు

పాయకరావుపేట రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురంలో డ్రైనేజీలు లేక రోడ్డుపై మురుగునీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు తొలగించాలని, డ్రైనేజీలు నిర్మించాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామానికి చెందిన నీలాపు వెంకటరెడ్డి, తదితరులు విమర్శిస్తున్నారు. మురుగునీటి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, దోమలు పెరిగిపోయాయని గ్రామస్థులు వాపోతున్నారు. దోమల వలన రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నడవడానికి అవస్థలు పడుతున్నామని వారంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి డ్రైనేజీలు నిర్మించి మురుగునీరు పోయేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగించాలని నోటీసులు జారీ

పాయకరావుపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం మెట్ట వద్ద ప్రధాన రోడ్డుకిరువైపులా ఉన్న డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించాలని గురువారం పంచాయతీ కార్యదర్శి వైవీ.సత్యనారాయణ ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు. కేశవరంలోని డెక్కన్ కంపెనీ కోసం రోడ్డును విస్తరించి డ్రైనేజీలు నిర్మించారు. అయితే రోడ్డును అనుకుని ఉన్న వారు డ్రైనేజీలను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో డ్రైనేజీలో పూడిక తీయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించాలని నోటీసులు అందజేసినట్టు కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు.

పంచాయతీ ఆఫీస్ వద్ద ఫిర్యాదు పెట్టె ఏర్పాటు



శ్రీరాంపురంలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం గ్రామపంచాయతీ వద్ద గురువారం పంచాయతీ అధికారులు ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మండలంలోని శ్రీరాంపురం, సత్యవరం, పాల్తేరు, పాయకరావుపేట పంచాయతీల వద్ద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాలని ఆదేశించిన మేరకు గురువారం ఏర్పాటు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి వైవీ.సత్యనారాయణ తెలిపారు.

నేడు వెల్చూరులో నూకాలమ్మ ఆలయం ప్రారంభం

రాంబిల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చూరులో నూకాలమ్మ ఆలయం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం జరగనున్నాయి. ఈ ఆలయాన్ని పిన్నమరాజు సుధీర్, పిన్నమరాజు వాసుల ఆర్థిక సాయంతో నిర్మించినట్టు ఎంపీటీసీ మాజీ సభ్యులు రేబాక అనందరావు, సర్పంచ్ కిల్లాడ మంగయ్యమ్మ, మాజీ సర్పంచ్ ఎస్.దేముళ్లు తెలిపారు. శుక్రవారం ఉదయం కాకినాడ శ్రీపీఠాధిపతులు పరిపూర్ణానంద స్వామివారి ఆధ్వర్యంలో వేదపండితులు ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు.

ఆపరేషన్లకు 18 మంది తరలింపు

ఎలమంచిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 1వ తేదీన ఏబీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసిన 18 మందిని గురువారం విశాఖలోని అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. ఈ వైద్య శిబిరంలో 340 మందికి వైద్యులు పరీక్షలు చేయగా 18 మందికి ఆపరేషన్లు అవసరమవుతాయని వైద్యులు గుర్తించారు. వీరిని గురువారం ప్రత్యేక వాహనంలో తరలించినట్టు ఏబీ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు తొట్టా నాగ శ్రీనువాస్, నక్కా వెంకట్ రమణ తెలిపారు.

అక్రమ లేఅవుట్‌పై ఈవోపీఆర్‌డీ విచారణ

అచ్యుతాపురం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడకలో అక్రమ లేఅవుట్‌పై గ్రామ జనసేన నాయకుడు ఎరిపిల్లి కానులు(కిరణ్) ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఈవోపీఆర్డీ శ్రీరాములునాయుడు విచారణ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ తాను గతంలో ఫిర్యాదు చేస్తే అప్పుడు పంచాయతీ కార్యదర్శి తప్పుడు రిపోర్టులు అధికారులకు పంపించారన్నారు. ఇదే విషయమై మరోసారి అధికారులు విచారణ చేపట్టాలని కోరారు. తప్పుడు రిపోర్టులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కిరణ్ డిమాండ్ చేశారు.

విద్యుత్ భారంపై కాంగ్రెస్ నిరసన



నెహ్రూచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నెహ్రూచౌక్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సదరు నాయకులు విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచబోమని, 30 శాతం విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి, నేడు అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే సర్దుబాటు చార్జీల పేరిట రూ. 18వేల కోట్లు విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతుండడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, అనంతరావు, చినబాబు, తుట్టా రమణ, కాళ్ల సత్యనారాయణ, బోయిన భానుమూర్తియాదవ్, వినకోట రాము, కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత'



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా సబ్బవరంలో అవగాహన ర్యాలీ

సబ్బవరం, నవంబరు 7 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూల అందరి బాధ్యతని లేబర్ ఆఫీసర్ పి.సూర్యనారాయణ అన్నారు. సబ్బవరంలో కార్మిక శాఖ, ఐసీడీఎస్, సీడ్స్ ఆర్గనైజేషన్, పోలీసు సిబ్బంది సంయుక్తంగా గురువారం పలు దుకాణాలు, మెకానిక్ షాపులు, దాబాలను తనిఖీ చేశారు. బాలలనుపనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.దివ్య, సీడీపీవో లలితకుమారి, సూపర్‌వైజర్లు పైడితల్లి, వై.ఇందిర, కె.స్వర్ణ, చిన్నారావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఉడ్‌పేట ప్రాంతానికి చెందిన బాలిక అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఇంట్లోని తెల్లవారుజామున కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లిపోయిందన్నారు. ఈ మేరకు తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

మద్యం మత్తులో సాక్ష్యం చెప్పడానికి వచ్చిన వ్యక్తికి జైలు

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సబ్బవరం మండలానికి చెందిన ఓ హత్య కేసులో మద్యం మత్తులో సాక్ష్యం చెప్పడానికి గురువారం ఇక్కడి పదవ అడిషినల్ సెషన్స్ జడ్జి కోర్టుకు వచ్చిన వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష, రూ. 50 జరిమానా విధించినట్టు అనకాపల్లి పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. సబ్బవరంలోని ఓ హత్యకేసులో సాక్ష్యం చెప్పడానికి అదే మండలం ఆదిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గొర్లి సత్తిబాబు కోర్టుకు హాజరయ్యారన్నారు. మద్యం మత్తులో సాక్ష్యం చెప్పడానికి హాజరు కావడం పై కేసు నమోదు చేశామన్నారు. నిందితున్ని కోర్టు ముందు హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.రమేష్ 24 గంటల కారాగార శిక్ష రూ.50లు జరిమానా విధించారన్నారు. నిందితున్ని అనకాపల్లి సబ్ జైలుకు తరలించినట్టు చెప్పారు.

'విద్యార్థులతో పనులు చేయించడం తగదు'

అనకాపల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి మండలంలోని బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులతో తరగతి గదులు, ఆట స్థలం శుభ్రం చేయిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సభ్యుడు అర్జున్ కోరారు. ఈ మేరకు గురువారం డీఈవో, డీఆర్‌ఓలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు స్వీపర్లను నియమించినప్పటికీ క్లాస్ టీచర్, హెచ్‌ఎం విద్యార్థులతో ఈ పనులు చేయించడం సరికాదన్నారు. సదరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

ఆటోను ఢీకొన్న వ్యాను : నలుగురికి స్వల్ప గాయాలు



డివైడర్ పైకి దూసుకెళ్ళిన ఆటో

కశింకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఆటోను బోలేరో వ్యాను ఢీకొంది. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నర్సీపట్నం నుంచి గురువారం ఓ ఆటో విశాఖపట్నం వెళుతోంది. బయ్యవరం సమీపంలో జాతీయ రహదారిపైకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న బొలేరో వ్యాను ముందు టైరు ఒక్కసారిగా పంక్చర్ అయ్యింది. దీంతో ముందు వెళ్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్ట జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పాడి రైతులకు స్టీల్ క్యాన్లు పంపిణీ

పరవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తానాం గ్రామంలోని మహిళా డెయిరీ (అమూల్) సహకార సంఘానికి పాలు పోస్తున్న వంద మంది పాడి రైతులకు బుధవారం రాత్రి స్టీల్‌క్యాన్లు పంపిణీ చేశారు. అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ హాజరై వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వర్రి వసంతరావు, రొంగలి అప్పారావు, సతీష్, డెయిరీ పీఎస్ పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళికలో ముందంజలో ఉండాలి

» హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు



గొల్లలపాలెంలో ఇళ్లను పరిశీలిస్తున్న బత్తుల

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం అమలుచేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలు ముందంజలో ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఆదేశించారు. గురువారం జగదాంబ జంక్షన్‌లోని జీవీఎంసీ జోనల్ 4 కార్యాలయంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న పథకమన్నారు. నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఈ విషయంలో కాంట్రాక్టర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా సాధ్యమైనన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్లు చేసిన ఫిర్యాదుపై స్పందిస్తూ, నిర్మాణాలు చేపట్టిన ఇళ్లకు జియో ట్యాగింగ్ ప్రక్రియ కొనసాగుతున్నందున త్వరలో బిల్లులు విడుదల చేస్తారన్నారు. సమీక్షలో సంస్థ చీఫ్ ఇంజనీరు జీవీ.ప్రసాద్, విశాఖ, అనకాపల్లి జిల్లాల పీడీలు ఆళ్ల శ్రీనివాసరావు, శ్రీనివాస్, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు. తొలుత సబ్బవరం మండలం గొల్లలపాలెం, తదితర లేఅవుట్‌లను సందర్శించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

పంట కాలువలు కబ్జా!

» వేలాది ఎకరాల సాగుకు అడ్డంకులు
» ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలోపం
» రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
» గగ్గోలు పెడుతున్న రైతులు

జమాదులపాలెంలో పలువురు ఇష్టారాజ్యం



పంట కాలువ దర్జాగా కబ్జా



పంట కాలువల చుట్టూ ఉన్న తాటిచెట్లు నరికివేసిన వైనం

వ్యవసాయం.. ఒకప్పుడు ఎంతో లాభసాటిగా ఉండేది. వర్షాధారమైనా.. వర్షాభావ పరిస్థితులైనా ప్రకృతి ఆ రకంగా సహకరించేది. దీంతో పంటలకు ధోకా ఉండేది కాదు. కష్టపడి సాగు చేసిన అన్నదాతలకు ఆ ఫలితం దక్కేది. కానీ గత కొన్నేళ్లుగా మానవ తప్పిదం కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. సకాలంతో వర్షాలు కురవడం మానేశాయి. పుడమిని నమ్ముకున్న ఎందరో రైతులు .. సాగుకు సెలవు ప్రకటించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బతుకు బాట పట్టారు. ఈ తరుణంలో పంటలను సాగుచేస్తున్న కొద్దిపాటి రైతుల కష్టాన్నైనా అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తెరగాలి. కానీ ఆ పరిస్థితి కానరావడం లేదు. ఇందుకు కశింకోట మండలంలోని పలుచోట్ల పంట కాలువల ఆక్రమణలనే ఓ ఉదాహరణగా చెప్పవచ్చు.

కశింకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని జమాదులపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న పంట కాలువలు పలుచోట్ల ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ కాలువలను ఆనుకొని ఉన్న పలువురు భూస్వాములు వాటిని సైతం కప్పివేసి పొలాలకు నీరు వెళ్లకుండా అడ్డుకట్ట వేస్తున్నారు. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. సుమారు పది నుంచి ముప్పై అడుగుల విస్తీర్ణం ఉండాల్సిన పంట కాలువలు ప్రస్తుతం ఐదు అడుగులు కూడా లేని దుస్థితి నెలకొంది అంటే.. ఆక్రమణలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

రంగబోలు గెడ్డ పరిసర ప్రాంతాల్లో ఉన్న పంట కాలువలకు కొండపై నుంచి వర్షపు నీరు వచ్చి చేరుతుంది. అనంతరం దిగువ ప్రాంతాల్లో ఉన్న పొలాలకు కాలువల ద్వారా వెళుతుంది. దీంతో వరి, చెరకు, అరటి, మొక్కజొన్న తదితర పంటలను ఈ ప్రాంత రైతులు సాగు చేస్తుంటారు. ఇక్కడ వ్యవసాయంపైనే అధిక శాతం ఆధారపడి ఉన్నారు. వర్షాలు కురిసినప్పుడు ఎగువ ప్రాంతం నుంచి పంట కాలువల్లోకి పుష్కలంగా నీరు చేరుతుంది. దీంతో ఏడాది పొడవునా ఈ ప్రాంతంలో సాగునీటికి ఢోకా ఉండేది కాదు. ప్రధానంగా వరి పంట సాగుకు ఎక్కువగా ఈ ప్రాంతంలో రైతులు ప్రాధాన్యం ఇస్తారు. సుమారు వెయ్యి ఎకరాల్లో ప్రతి ఏటా వరి పంట సాగు చేసేవారు. కానీ ఈ ఏడాది సగానికి పైగా మాత్రమే వరి పంట వేశారు. పంట పొలాలకు నీరు అందే పరిస్థితి లేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పలువురు రైతులు వాపోతున్నారు. ఆక్రమణలు జరిగే ఆరంభంలోనే అధికారులు స్పందించి ఉంటే నేడు ఈ దుస్థితి ఉండేది కాదని అంటున్నారు. ఈ ప్రాంతంలో ఒకరిని చూసి ఒకరు అన్న చందాన ఆక్రమణలు సాగుతున్నాయని వాపోతున్నారు.



గెడ్డకు వెళ్లే ప్రధాన కాలువను ఆక్రమణ

ఆక్రమణలు తొలగించాలి

పంట కాలువల ఆక్రమణలు తొలగించి, పొలాలకు సక్రమంగా నీరు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. ఎప్పటికప్పుడు పంట కాలువలను శుభ్రం చేస్తే పంటల సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, తమకు కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని వారంతా పేర్కొంటున్నారు. ఈ దిశగా అధికారులు, పాలకులు కృషిచేయాల్సింది కోరుతున్నారు.



రంగబోలు గెడ్డకు వెళ్లే కాలువను కప్పి వేసిన అరటి మొక్కలు

చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడే లక్ష్యం కావాలి

» సచివాలయ పోలీసులకు డీఎస్పీ శ్రావణి సూచన » గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్‌లో తెలపాలని ఆదేశం



మహిళా పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే తక్షణమే ఆయా పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి సూచించారు. ఇక్కడి పోలీస్ అతిథి గృహం సమావేశ మందిరంలో అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలోని మహిళా పోలీసులతో గురువారం ఆమె సమావేశమయ్యారు. ముందుగా మహిళా పోలీసుల సమస్యలు, విధుల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గ్రామాల్లో ఉండి అక్కడ జరుగుతున్న కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తూ ప్రభుత్వానికి, పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ మహిళా పోలీసుల సేవలను డీఎస్పీ కొనియాడారు. ఈ సమావేశంలో అనకాపల్లి పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

153 మందికి కంటి పరీక్షలు

పరవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాంకీ ఫౌండేషన్, ఎల్వీ ప్రసాద్ నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తొలుత ఈ శిబిరాన్ని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ ప్రారంభించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎల్వీ ప్రసాద్ నేత్రాలయం వైద్యులు 153 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధరభక్తి, హెచ్‌ఆర్ ప్రతినిధి భరత్, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, మహిళా కో-ఆర్డినేటర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శ్రవణ నక్షత్ర పూజలు రేపు

పరవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొండపై కొలువైన అభయ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పంచామృతాభిషేకాలు, గోత్రనామాలతో అర్చనలు వంటివి జరుపుతామన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్‌కు సబ్బవరం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సబ్బవరం, నవంబరు 7 :ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల అనకాపల్లిలోని గవరపాలెం జీవీ ఎంసీ హైస్కూల్ మైదానంలో జరిగిన అండర్-14, అండర్-17 విభాగాల ఎంపిక పోటీల్లో విద్యార్థులు జి.అఖిలేష్‌కుమార్, జి.మనోజ్‌కుమార్, ఎ.ప్రియాంక, కె.వెంకటలక్ష్మి, బి.గ్రీష్మ, కె.రేవతి, పి.దీపిక అద్భుతంగా ఆడడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్టు చెప్పారు. ఏలూరులోని చింతలపూడి జీహెచ్ఎస్ పాఠశాలలో ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి జరగనున్న పోటీల్లో తలపడనున్నారని హెచ్‌ఎం ఎస్.తిరుపతిరావు తెలిపారు. ఆయనతో పాటు పీడీ అబ్దుల్ రెహ్మాన్, ఎస్ఎంసీ చైర్మన్ జి.శంకరరావు, వైస్ చైర్మన్ జ్యోతి తదితరులు అభినందించారు.

11న భవన నిర్మాణ కార్మికులు ధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు


కొత్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 11న అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు గౌరీశంకర్ తాపీ పని సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు ఎన్.కొండలరావు తెలిపారు. కూండ్రం గ్రామంలో గురువారం సంఘ సభ్యులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఉచిత ఇసుకను ప్రభుత్వమే అన్ని ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునఃప్రారంభించి పెండింగ్‌లో ఉన్న 42వేల క్లయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలన్నారు. కూటమి అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు ఫైల్‌పై మొదటి సంతకం పెడతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంఘ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జె.రామారావు, ఎస్.సూరిబాబు, కె.అప్పలనాయుడు, సురేష్, వై.బుజ్జి, రమణ, పి.శ్రీనివాసరావు, తాతబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాల పరిమితి సర్క్యులర్ రద్దుకు వీవోఏల ఆందోళన

పరవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డ్వాక్రా వీవోఏల సంఘం మండల ప్రతినిధులు ఎం.ఉమా మహేశ్వరి, సీహెచ్.లక్ష్మి మాట్లాడుతూ వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలను తక్షణమే విడుదల చేయాలని, 45 సంవత్సరాల వయస్సు కాలపరిమితిని రద్దు చేయాలని, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి సీనియర్ అసిస్టెంట్ ఫిరోజ్ బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు వరలక్ష్మి, పైడిలక్ష్మి, పుష్ప, రమణమ్మ, నీలిమా, వెంకటలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వెగులు వీవోఏలు గురువారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీవోఏలకు మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయడంతో పాటు వేతన బకాలయి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మీప్రసన్న, వి.కనక మహాలక్ష్మి, పి.వరలక్ష్మి, సీత, లక్ష్మీ, మంగ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ నివారణకు అవగాహన ర్యాలీ



తుమ్మపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



కశింకోట మండలం అచ్చెర్ల గ్రామంలో...

తుమ్మపాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని తుమ్మపాలలో పీహెచ్‌సీ సిబ్బంది కేన్సర్ నివారణపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.వాణిజగదీశ్వరి మాట్లాడుతూ కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వచ్చి స్క్రీనింగ్ టెస్టులు చేస్తారన్నారు.

కశింకోట : ఇక్కడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యంలో గురువారం కేన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, పీహెచ్‌హెచ్ సత్యవతి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి రమేష్, సిబ్బంది పాల్గొని కేన్సర్‌పై అవగాహన కల్పించారు. అలాగుచ అచ్చెర్ల గ్రామంలో క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. కేన్సర్ పట్ల ప్రజలంతా పూర్తి అవగాహన కలిగి ఉండాలని టీడీపీ నాయకుడు నైనంశెట్టి రమణారావు పిలుపునిచ్చారు. పలువురు ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైనీ కానిస్టేబుల్ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి

» ఎస్పీ తుహిన్‌సిన్హా



అనకాపల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ కానిస్టేబుల్ సివిల్ (పురుషులు, మహిళలు), ఎస్‌సీటీ పోలీస్ కానిస్టేబుల్ ఏపీఎస్పీ (పురుషులు) పోస్టులకు జరిగిన ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ పరీక్షలు డిసెంబరు చివరి వారంలో ప్రభుత్వం నిర్వహిస్తుందని ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులంతా స్టేజ్-2 దరఖాస్తు ఫారంను ఎస్ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్‌లో నింపని వారు ఈ దిగువ తేదీల్లో సమర్పించాలన్నారు. ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఈ నెల 21వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఎస్ఎల్‌పీఆర్‌బీ వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని, అభ్యర్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం హెల్ప్‌లైన్ నంబరు 9441450639ను సంప్రతించాలన్నారు

వర్సిటీ స్థాయి క్రీడల్లో 'డీవీఎన్'కు పతకాలు



పతకాలతో క్రీడాకారులు

అనకాపల్లి టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో ఇటీవల జరిగిన ఇంటర్ కొలిగేట్ వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో దాడి వీరునాయుడు కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. ఎస్.బాలసాయి చరణ్ 83 కిలోల లిఫ్టింగ్ విభాగంలో బంగారు పతకం సాధించారు. 59 కిలోల పవర్ లిఫ్టింగ్ విభాగంలో జి.నాగరాజు కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ తెలిపారు. విజేతలను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అభినందించారు.

సీఐటీయూ నేత రమేష్‌కు నివాళి

అనకాపల్లి టౌన్/పరవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం యూనియన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రమేష్ వర్ధంతిని జరిపారు. ఆయన చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కీర్తించారు. జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం చైర్మన్ గంటా శ్రీరామ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, పరమేశ్వరరావు, గండి నాయనబాబు, సూర్యకళ, అల్లురాజు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పరవాడలో జరిగిన రమేష్ వర్ధంతి సభలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు జి.శ్రీను, గురునాథరావు, అప్పారావు, నాయుడు తదితరులు నివాళులర్పించారు.

తాగు నీటి సమస్యకు పరిష్కారం

అనకాపల్లి టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం చినరామస్వామి కోవెల వద్ద ఉన్న మినీ వాటర్ ట్యాంక్ పైపులైన్ పూర్తిగా దెబ్బతినడంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు జీవీఎంసీ అధికారులకు తెలియజేశారు. దీంతో సదరు అధికారులు దెబ్బతిన్న పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి, అక్కడి ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి బొడ్డేడ మురళీ, జనసేన నాయకులు సూరిశెట్టి రాముడు, కాండ్రేగుల బుజ్జి, మద్దాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం

సబ్బవరం, నవంబరు 7 : మండల కేంద్రం సబ్బవరంలోని పురాతన శివాలయం స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న ఆయానికి స్థానిక రామ్‌కుమార్ ఆగ్రో ఏజెన్సీ యజమాని కుమారి గురువారం రూ.1,00,116 విరాళం అందజేశారు. ఈ మేరకు విరాళ దాతను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నానిబాబు, ప్రకాష్, గెడ్డం కృష్ణ, బర్ల రమణ, కొల్లి కృష్ణ ప్రకాష్ తదితరులు అభినందించారు.

నేడు రెండు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫీడర్లు మరమ్మతు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ శుక్రవారం ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఎస్ఎం అప్పారావు తెలిపారు. ముంచంగిపుట్టు మండలంలోని మాకవరం ఫీడర్ పరిధిలో మరమ్మతుల చేపడుతున్నందున మాకవరం, బరడ, వనుగుమ్మ, కించాయిపుట్టు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. హుకుంపేట మండలం బాకూరు ఫీడర్ పరిధిలోని అడ్డుమండ, సన్యాసమ్మపాలెం, ముళియాపుట్టు, బూరాపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'కస్తూర్బా' ఉపాధ్యాయినికి సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న కృష్ణకుమారి

డుంబ్రిగుడ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తుర్బా గాంధీ గురుకుల బాలిక విద్యాలయంలో ఆంగ్లం ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న కె.కృష్ణకుమారి జాతీయ స్థాయిలో సేవారత్న అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలో జాతీయ మానవ హక్కుల నేర నిరోధక సంఘం సదస్సు జరిగింది. ఈ సందర్భంగాగిరిజన ప్రాంతంలోసేవా భావంతో కృష్ణ కుమారి అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేశారు. డుంబ్రిగుడ కు చెందిన ఆమెను గ్రామస్థులు, పాఠశాల యజమాన్యం,పలువురి నేతలు అభినందించారు.

10 మంది జూదగాళ్లు అరెస్టు

కొయ్యూరు, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : పేకాట శిబిరంపై గురువారం సాయంత్రం దాడిచేసి 10 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 11, 200 లు స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సీఐ వెంకటరమణ తెలిపారు. బం గారిపేట పంచాయతీ పరదేశిపాకలు గ్రామంలోముందస్తు సమాచారంమేరకు ఎస్ఐ కిశోర్‌వర్మసిబ్బందితో దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిపై నమోదు చేయనున్నట్టు సీఐ తెలిపారు.

వేతనాల కోసం 104 సిబ్బంది ఆందోళన

ముంచంగిపుట్టు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల వేతన బకాయిలు తక్షణం అందించాలని 104 వాహన సిబ్బంది డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పలు సమస్యలపై వినతి పత్రాన్ని డాక్టర్ శిరీషకు అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సమరెడ్డి గణపతిరాజు, కిముడు క్రిష్ణవేణి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం నిరంతరం పని చేస్తున్నా సకాలంలో జీతాలు అందడంలేదన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలు అందే విధంగా చూడాలని వారు కోరారు.

తాగునీటి పథకానికి శంకుస్థాపన

హుకుంపేట నవంబరు 7 (ఆంధ్రజోతి) ; మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీ గవ్వల మామిడి గ్రామంలో తాగునీటి పథకం నిర్మాణానికి వైస్ ఎంపీపీ ఎస్. కొండలరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య గ్రామస్థులు తన దృష్టికి తేవడంతో రక్షిత పథకం మంజూరు చేయించినట్టు తెలిపారు. ఈ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన స్వచ్ఛంద సేవా సంస్థలతో ఒక ఫోరమ్ ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ రూపాల్లో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు, సోషల్ రెస్పాన్స్ కంపెనీలతో ఈ ఫోరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 8 నుంచి 20 వరకు ఫోరమ్‌లో సభ్యత్వానికి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు.మరిన్ని వివరాలకు నారాయణరెడ్డి ఫోన్: 8106797474కు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.



బోడగుడ సమీపంలోని కోతకు గురైన చోట ఒరిగిన లారీ (ఫైల్)



రహదారి మధ్య భారీ రంధ్రం



రోడ్డుపక్కన జారిపోతున్న మట్టి

అదుపు తప్పితే అంతే..!

- గోతులతో అధ్వానంగా అనంతగిరి- ములియగుడ రహదారి
- పట్టించుకోని ఏన్‌హెచ్‌ఏఐ అధికారులు

అనంతగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి నుంచి ములియగుడ వెళ్లే రహదారి గోతులు, రాళ్లు తేలి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు హడలిపోతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనంతగిరి నుంచి బోడగుడ మీదుగా ములియగుడ వరకు రోడ్డు భారీగా కోతకు గురైంది. ఈ రోడ్డులో వాహనాలు అదుపుతప్పితే.. ప్రమాదం పొంచి ఉందని భయాందోళన చెందుతున్నారు. గత కొద్దిరోజుల క్రితం అరకు వైపుగా సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ.. బోడగుడ సమీపంలోని ఎదురుగా వచ్చే వాహనం తప్పించే క్రమంలోని కోతకు గురైన చోట కూరుకుపోయింది.

ఓ వైపునకు ఒరిగిపోయిన ఈ ల్యారీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనూ ప్రమాదమే తప్పింది. ఈ నాలుగు కిలో మీటర్ల మేర ఉన్న ఈ రహదారి మరమ్మతులపై కనీసం దృష్టిపెట్టకపోవడంతో పాటుగా రోడ్డుకు ఇరువైపులా గోతుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంది. మరిన్ని ప్రమాదాలు జరిగితే తప్ప పట్టించుకోరా.. అంటూ ఎన్‌హెచ్‌ఏఐశాఖ అధికారుల తీరుపై వాహనదారులు మండిపడుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం



స్వాగతం పలుకుతున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

పాడేరురూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ పీర్ బృందం గురువారం సందర్శించింది. వీరికి అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. నాక్ ఛైర్మన్ రమేష్ శర్మ, కో-ఆర్డినేటర్ నెంబరు కులభూషణ్ చందేల్, సుష్మగోస్లేలు కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విషయాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాలలో మంచి శిక్షణ అం దించాలని అధ్యాపకులకు సూచించారు.ఐక్యూ ఏసీ రూమ్‌లో సిబ్బందికి పలు సూచనలు చేశారు. సాయంత్రం కళాశాల విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించారు. కూచిపూడి, థింసా, కోలాటం, ఫోక్ డ్యాన్స్‌లను చూసి వారిని అభినందించారు. ఈ ప్రాంత ఆచార వ్యవహారాల గురించి అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ డాక్టర్. శోభారాణి, ప్రిన్సిపాల్ వి.చిట్టిబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్, నక్కపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే



విద్యార్థులతో డీఈవో, టీడబ్ల్యు ఇన్‌చార్జి డీడీ తదితరులు

పాడేరురూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే కార్యక్రమాన్ని గురువారం స్థానిక తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డీఈవో పి.బ్రహ్మాజీరావు, టీడబ్ల్యూ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజని మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్‌కు సంబంధించి విద్యార్థులకు పలుసూచనలందించారు. సౌట్ శిక్షణతో విద్యార్థులకు క్రమ శిక్షణ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ వినయ్ మోహన్‌రావు, స్కౌట్ అండ్ గైడ్‌జిల్లా సెక్రటరీ లవకుశ, షరీఫ్‌బిలస్కార్, విద్యార్థులతోపాటు పాడేరు, హుకుంపేట కేజీబీవీ విద్యార్థినులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలి: పీవో

పాడేరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని పర్యాటక ప్రదేశాల్లో విధిగా డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని తహసీల్దార్లతో గురువారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో పర్యాటకులు అధిక సంఖ్యలో ఏజెన్సీకి విచ్చేస్తారన్నారు. ఈ క్రమంలో ఆయా ప్రదేశాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలనిసూచించారు. పర్యాటకులు సైతం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే పర్యాటక ప్రదేశాల్లో ప్లాస్టిక్‌ను వినియోగించకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, డివిజన్‌లోని తాహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

దుకాణాదారులు నిబంధనలకు కట్టుబడాలి

- సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్



రహదారిలో దుకాణాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్

డుంబ్రిగుడ, నవంబరు7(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణ పనులకు నిబంధనలకు కట్టుబడి సహకరించాలని దుకాణాదారులకు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం మండల కేంద్రంలో జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా దుకాణాలను పరిశీలించి సర్వే చేశారు. ఎన్‌హెచ్ అధికారులు నిర్దేశాలకు కట్టుబడి ఉండాలన్నారు. ఇప్పటికే నష్టపోయిన దుకాణాలకు నష్టపరిహారం చెల్లించినట్టు చెప్పారు. సంబంధిత అధికారులు నిర్దేశించిన స్థలాలను అతిక్రమించకూడదని ఆదేశించారు. మూడు రోజుల్లోగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్, రెవెన్యూ సిబ్బంది. జాతీయ రహదారి అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



బాలింతల ఆరోగ్యం తెలుకుంటున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

డుంబ్రిగుడ, నవంబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో జమాల్ బాషా గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. రోజువారి రోగుల రాక వివరాలను అడిగితెలుసుకున్నారు. మందుల గదిని ఆయన పరిశీలించారు. బాలింతల వార్డులో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో నైట్ వాచ్‌మెన్, స్వీపర్, వైద్య సిబ్బంది ఉండేలా భవనాలు ఏర్పాటు చేయాలని ఈసందర్భంగా వైద్యాధికారి రాంబాబు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శౌరి, దిన, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగాలు ఆదివాసీలతో భర్తీ చేయాలి

ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైరన్ రాజబాబు

గూడెంకొత్తవీధి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానిక గిరిజనులతో భర్తీ చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ నాయకులు స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ప్రభుత్వం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీల కుశతశాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈమేరకు ముఖ్యమంత్రికి తహసీల్దార్ ద్వారా వినతి పత్రం పంపించామన్నారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ మండల కన్వీనర్ కొర్ర బలరామ్, ప్రధాన కార్యదర్శి సిద్ధర్థమార్కు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: జీవో 3 స్థానంలో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం తేవాలని కోరుతూ తహసీల్దార్ వంజంగి త్రినాథరావునాయుడుకు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శేషాద్రి మాట్లాడుతూ ఏపీ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో 48 గంటల పాటు నిర్వహించిన ఆదివాసీల ఆవేదన దీక్షలో భాగంగా గురువారం జిల్లాలోని 22 మండలాల తహసీల్దార్లకు ఆయా మండలాల నాయకులు వినతులు అందించారన్నారు. జనరల్ కేటగిరి డీఎస్సీ నోటిఫికేషన్‌తో కలిపి ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ నియామకాలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు నాయకులు వి.రామారావు, బి.రాజబాబు, ఆదినారాయణ, మాలంనాయుడు గోపాలపాత్రుడు, ఆనందరావు పాల్గొన్నారు.



పాడేరులో తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

వైసీపీ తప్పిదంతో ఆదివాసీలకు రిజర్వేషన్లు దూరం: భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

చింతపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం తప్పిదం వల్లనే ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ దూరమైందని భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే సుప్రీంకోర్టు జీవో 3ను రద్దు చేసిందన్నారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉంటే ప్రత్యామ్నాయ జీవోగాని, షెడ్యూల్డ్ ప్రాంత నియామకాల చట్టంగాని తీసుకొని వచ్చే అవకాశం ఉండేదన్నారు. గిరిజనులకు శతశాతం రిజర్వేషన్ నాటి గిరిజన శాసన సభ కమిటీ అధ్యక్షుడు తెల్లం బాలరాజు ద్వారా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లినా కనీసం పట్టించుకోలేదన్నారు. ఆ పార్టీ నాయకులు నేడు అధికారం కోల్పోయిన తరువాత గగ్గోలు పెట్టడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఇకనైనా గిరిజన వైసీపీ ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే ఆదివాసీల పక్షాన ముఖ్యమంత్రి చం ద్రబాబును కలిసి జీవో 3 సాధించే దిశగా అడుగులువేయాలన్నారు.



తహసీల్దార్‌కి వినతి పత్రమిస్తున్న జేఏసీ నాయకులు

ముందస్తు వైద్య పరీక్షలతో కేన్సర్‌కు చెక్

- అవగాహన ర్యాలీలు

సీలేరు, నవంబరు 7 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో బుధవారం కేన్సర్ వ్యాధిపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్‌కే మస్తాన్‌వల్లీ, కె సౌమ్య ల ఆధ్వర్యంలో ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, విద్యార్థులతో పీహెచ్‌సీ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా నిలిచి ప్రజలకు కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మస్తాన్‌వల్లీ మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ముందస్తు పరీక్షలతో వ్యాధినుంచి రక్షణ పొందవచ్చని సూచించారు. కేన్సర్ ప్రారంభ దశలోనే గుర్తిస్తే ప్రాణాంతకం ఉండని ఆయన తెలిపారు. వ్యాధి గుర్తింపు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి జోజిబాబు, హెల్త్ సూపర్‌వైజర్లు త్రినాథరావు, బాలామణి, ఆరోగ్య కార్యకర్తలు సత్యనారాయణ, కుమారీ, దేవీ తదితర్లు పాల్గొన్నారు.

పెదబయలు: కేన్సర్‌పై స్థానిక పీహెచ్‌సీ నుంచి అంబేడ్కర్ పార్కు వరకు వైద్యాధికారి జి. నిఖిల్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బంది ప్రధాన మానవహారంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, ఈ నెల 14 నుంచి 18ఏళ్లు దాటిన ప్రతి వ్యక్తికీ స్క్రీనింగ్ టెస్ట్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద సిబ్బంది వెంకటరావు, పార్వతి, బాబురావు, స్టాఫ్ నర్సులు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పొగతాగడం మానాలి: వైద్యాధికారి కోమలి

గూడెంకొత్తవీధి: ఆదివాసీలు కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని పెదవలస పీహెచ్‌సీ వైద్యాధికారి కోమలి అన్నారు. గురువారం జాతీయ క్యాన్సర్ దినోత్సం పురస్కరించుకుని పంచాయతీ కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ధూమపానం అలవాటు మానుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్. శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈవో పెద్దబాలరాజు, హెచ్‌వీలు రోజీగోల్డ్, దేవమణి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: కేన్సర్ ముందస్తు జాగ్రత్తతో నిర్మూలించవచ్చునని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీడీలు కాల్చడం, ఖైనీ, పాన్‌పరాగ్ వంటి అలవాట్లు ఉన్నవారు స్క్రీనింగ్ పరీక్షలను చేయించుకోవాలన్నారు.



సీలేరులో మాట్లాడుతున్న వైద్యాధికారులు మస్తాన్‌వల్లీ, సౌమ్య



పెదబయలులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కిశోర బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ: సీడీపీవో



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సీడీపీవో జీవీ రమణ

చింతపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణసూచించారు. గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీలతో నిర్వహించిన ప్రాజెక్టు సమావేశం లో ఆయన మాట్లాడారు. కిశోర బాలికలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. బాలికలకు తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమాజంలో జరుగుతున్న అకృత్యాలపై చైతన్యం కల్పించాలన్నారు. అపరిచిత వ్యక్తులతో స్నేహసంబంధాలు కలిగి ఉండరాదని, మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కల్పించాలన్నారు. కిశోర బాలికల రక్షణ కోసం గ్రామాల్లో 20మందిని ఒక గ్రూప్‌గా ఏర్పాటు చేశామన్నారు. బాల్యవివాహాల నిరోధించేందుకు గ్రామ స్థాయిలో సర్పంచ్ నేతృత్వంలో చైల్డ్ మ్యారేజ్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవిహాలను జరిగినట్టు తెలిస్తే కమిటీ సభ్యులు కౌన్సెలింగ్ చేసి అడ్డుకుంటారన్నారు. బాలింతలు, గర్భిణులు బాలసంజీవని కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో రామలక్ష్మి, సూపర్‌వైజర్లు కె. విజయకుమారి, ఎస్కే. గౌహార్ ఉన్నీష, సీహెచ్ సత్యవతి, ఎస్. గౌరి, పి. అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు



పాతకోటలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

హుకుంపేట నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఉప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి రేఖ తెలిపారు. గురువారం మండలంలోని పాతకోట పంచాయతీలో పీహెచ్‌సీపీ సిబ్బంది, 104 సిబ్బందితో కలిసి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గర్భినులు, బాలింతలు, ఇతర రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ, ఎవరైనా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నట్లయితే, వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి రావాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బు వృథా చేసుకోవద్దని కోరారు. ప్రభుత్వం అన్ని రకాల మందులు ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గండేరు మురళీ, సూపర్‌వైజర్ లక్ష్మణరావు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే కూరగాయల అధిక దిగుబడి



వివరిస్తున్న శాస్త్రవేత ప్రదీప్

ముంచంగిపుట్టు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి మెలకువలతో కూరగాయల సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత ప్రదీప్ అన్నారు. గురువారం మండలంలోని పెదగూడ పంచాయతీ గూడమాలిపుట్టులో కూరగాయల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా ప్రదీప్ రైతులు తీసుకోవాల్సిన జా గ్రత్తలు వివరించారు. కూరగాయ మొక్కలు నాటే ముందు లోతు దుక్కు చేసుకోవాలని, వేప పిండి, పశువుల గత్తం సమ పాలలో కలపి జల్లుకోవావాలన్నారు. కాయ తొలుచు పురుగు ఆశించకుంటే పంట శానిటేషన్ చేయాలని సూచించారు. ప్రధానంగా నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి విజయ లక్ష్మీ, ఏవో శ్రీనివాస బాబు, ఉద్యాన అధికారి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

'అసెంబ్లీకి వెళ్లని వైసీపీ ఎమ్మెల్యేలకు మాట్లాడే హక్కులేదు'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చింతపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఓట్లతో గెలిచిన వైసీపీ ఎమ్మెల్యేలు చట్ట సభలకు వెళ్లకుండగా ఆదివాసీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో టీడీపీ ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలు తమ సమస్యలను చట్ట సభల్లో వినిపిస్తారని ఎంతో నమ్మకంతో వైసీపీ ఎమ్మెల్యేలకు భారీ మెజారిటీని కట్టబెట్టారన్నారు. వీరు చట్ట సభలకు వెళ్లి ఆదివాసీ సమస్యలపై తమ గొంతు వినిపించాల్సిందిపోయి జగన్మోహన్‌రెడ్డి వ్యక్తిగత ప్రయోజనం కోసం పాకులాడుతుండం శోచనీయమని విచారం వ్యక్తంచేశారు.అసెంబ్లీ సమావేశాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష జీవోపై ప్రస్తావించారన్నారు. పాడేరు, అరకు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకపోవడంతో గిరిజనుల సమస్యలపై మాట్లాడే అవకాశంలేకుండాపోయిందన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కేశ్వరరావు, అబ్బాయిదొర, వల్లీ పాల్గొన్నారు.

పంచాయతీ భవనంలో నివాసంపై విచారణ



వివరాలను అడిగితెలుసుకుంటున్న తహసీల్దార్

అనంతగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చిలకలగెడ్డ పాత పంచాయతీ భవనంలో ఓ కుటుంబం ఉండడంతో స్థానికులు తహసీల్దార్ మాణిక్యంనకు గురువారం ఫిర్యాదు చేశారు. కార్యదర్శిపై విచారణ చేపట్టారు. తహసీల్దార్, సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యుల సమక్షంలోని ఈ భవనాన్ని పరిశీలించి, నివాసం ఉంటున్న కుటుంబాన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి విస్తరణతో ఇళ్లు కోల్పోయామని, అందుకే ఈ భవనంలో ఉంటున్నట్టు వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



చింతపల్లిలో ఆందోళన చేస్తున్న వీవోఏలు

పాడేరురూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలనిఆంధ్రప్రదేశ్ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్ భాను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య (వెలుగు)కార్యాలయం వద్ద వీవోఏల చేపట్టిన రెండు రోజులు ధర్నా గురువారం సాయంత్రం ముగించారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ వీవోఏలకు 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని కోరారు. వీవోఏల సంఘం జిల్లా నాయకులు ఎల్‌బీ.పోతురాజు, మండల నాయకులు సువర్ణ, తార, కొండబాబు, 26 పంచాయతీల వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: వీవోఏల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం వీవోఏలు తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర బాలయ్య, వీవోఏల నాయకులు పాంగి పుష్ప, చిలకల రామలింగం, శోభన్‌బాబు పాల్గొన్నారు.

చింతపల్లి: వీవోఏలు కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈకార్యక్రమంలో వీవోఏ ల సంఘం నాయకులు దుర్గ, సుమాని, సత్యనారాయణ, వి. రామన్న, కె. సుబ్బారావు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

- ఇంటర్వ్యూలకు 857 మంది హాజరు
- 273 మందికి ఉద్యోగావకాశాలు



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

నర్సీపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాల ఆవరణలో 857 మంది నిరుద్యోగ యువతీ యువకులు పేర్లు నమోదు చేసుకున్నారు. అరబిందో ఫార్మా, డెక్కన్ కెమికల్స్, గ్లాండ్ ఫార్మా, అపోలో ఫార్మసీ, ఫ్యూచర్ ప్రాపర్టీ గ్రూప్, టీవీఎస్ తదితర పదిహేను కంపెనీలకు సంబంధించిన హెచ్‌ఆర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించి, 273 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజుతో పాటు ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

11న ఐటీఐలో అప్రెంటీస్ మేళా

నర్సీపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఐటీఐలో ఈనెల 11వ తేదీన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. జిల్లాలోని ప్రముఖ కంపెనీలు ఈ మేళా ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేలు ఐటీఐలలో శిక్షణ పూర్తి చేసుకున్న వారు హాజరు కావాల్సిందిగా కోరారు.

సర్పా నదిలో చెత్త వెయ్యవద్దు

- నర్సీపట్నం నుంచి వచ్చిన ట్రాక్టర్లను అడ్డుకున్న కొండల అగ్రహారం టీడీపీ నాయకులు



చెత్తతో వచ్చిన ట్రాక్టర్లను అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు

మాకవరపాలెం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సర్పా నదిలో చెత్తను వేయవద్దంటూ కొండల అగ్రహారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సుర్ల శంకర్రావు ఆధ్వర్యంలో పలువురు చెత్త ట్రాక్టర్లను గురువారం అడ్డుకున్నారు. కార్తీకమాసం కావడంతో పవిత్ర స్నానాలు చేసేందుకు భక్తులు వస్తుంటారని భావించి కొండలగ్రహారం టీడీపీ నాయకులు చందాలు వేసుకొని సర్పానదిని ఆవరణను శుభ్రం చేయించారు. ఈ నేపథ్యంలో మాకవరపాలెం గ్రామానికి చెందిన చెత్తను నాలుగు ట్రాక్టర్ల ద్వారా పంచాయతీ సిబ్బంది తెచ్చి నదిలో వేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఆ గ్రామ టీడీపీ నాయకులు చెత్త ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు చేసేది లేక సదరు ట్రాక్టర్లను వెనక్కి తీసుక వెళ్లిపోయారు.

వసతి తక్కువ.. వెతలు ఎక్కువ..

- ఒకే హాస్టల్‌లో ఎస్సీ బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులు
- వంద మంది పట్టే భవనంలో 220 మంది బస
- ఉదయం నిద్ర లేచింది మొదలు అన్నీ సమస్యలే
- పట్టించుకోని అధికారులు
- అసౌకర్యాల నడుమ చదువులు



నర్సీపట్నం పాల్ ఘాట్ సెంటర్‌లో మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహం



నిరుపయోగంగా శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలురు వసతి గృహం-1 భవనం

నర్సీపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వంద మంది ఉండాల్సిన వసతి గృహంలో 220 మంది ఉంటుండడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నర్సీపట్నం పాల్‌ఘాట్ సెంటర్‌లో మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆరు నుంచి పది తరగతుల్లో 145 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు.

మెయిన్ రోడ్డును ఆనుకొని ఉండడంతో డిమాండ్

వాస్తవానికి ఈ వసతి గృహంలో శాంక్షన్ సీట్లు వంద మాత్రమే. మెయిన్ రోడ్డును ఆనుకొని వసతి గృహం ఉండడం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి) దగ్గరగా ఉండడంతో ఈ వసతి గృహంలో చేర్పించడానికి విద్యార్థినుల తల్లిదండ్రులు ఎక్కువ ఇష్టపడుతుంటారు. దీంతో డిమాండ్ బాగా ఉంటుంది. ఈ కారణంగా వంద సీట్లు భర్తీ అయినా పలువురు నేతల సిఫార్సుల మేరకు అదనంగా 45 మందిని చేర్చుకున్నారు. వసతి తక్కువ, విద్యార్థినుల సంఖ్య ఎక్కువ కావడంతో అంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఇదే భవనంలోకి బాలికల కళాశాల విద్యార్థినులు తరలింపు

ఎస్సీ బాలికల వసతి గృహంలో చాలీచాలని గదులు ఉంటే ఎస్సీ కళాశాల బాలికలను కూడా ఇక్కడే ఉంచారు. ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహానికి అద్దె భవనం దొరక్క పోవడంతో కాలేజ్ విద్యార్థినులను రెండేళ్ల క్రితం ఎస్సీ బాలికల వసతి గృహంలోకి తరలించారు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థినులు 75 మంది ఉన్నారు. దీంతో ఎస్సీ బాలికల వసతి గృహంలో 145 మంది ఆరు నుంచి పది చదువుతున్న విద్యార్థినులతో పాటు, 75 మంది కళాశాల విద్యార్థినులు తలదాచుకుంటున్నారు.

వసతి చాలక తీవ్ర ఇబ్బందులు

వసతి గృహంలో విద్యార్థినులు విశ్రాంతి తీసుకోవడానికి ఆరు గదులు మాత్రమే ఉన్నాయి. స్టోర్ రూమ్, వంటశాల, డబ్ల్యూహెచ్‌వో ఆఫీసు గదులు ఉన్నాయి. కళాశాల విద్యార్థినులు, స్కూల్ విద్యార్థినులు 220 మంది పడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గదులు సరిపోక డబ్ల్యూహెచ్‌వో ఆఫీసు గదిలో కూడా పడుకుంటున్నారు. వసతి గృహంలో ఉన్న తొమ్మిది మరుగుదొడ్లు విద్యార్థినులకు సరిపోవడం లేదు. ఉదయం స్కూల్‌కి, కళాశాలకు రెడీ అవ్వడానికి వీరి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

ఎస్సీ బాలిక కళాశాలకు వసతి గృహం అవసరం

బీసీ కాలనీలోని ఎస్సీ బాలుర వసతి గృహం-1కు సంబంధించిన స్థలం నిరుపయోగంగా ఉంది. ఎనిమిదేళ్ల క్రితం ఇక్కడ చదువుతున్న వారిని కోటవురట్ల ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో కలిపారు. దీంతో భవనం ఖాళీగా ఉండి పోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. కోట్లు విలువ చేసే స్థలం నిరుపయోగంగా మారడంతో ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈ స్థలంలో ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం నిర్మాణం కోసం ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఇక్కడ కళాశాల వసతి గృహం నిర్మాణం చేపడితే ఎస్సీ బాలికల వసతి గృహంలో సమస్య పరిష్కారం అవుతాయని ఆమె వివరించారు.

వీవోఏల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి



నర్సీపట్నంలో ధర్నా చేస్తున్న వెలుగు వీవోఏలు

నర్సీపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వెలుగు వీవోఏల మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఇక్కడి వెలుగు కార్యాలయం వద్ద వారంతా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వెలుగు వీవోఏల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వీవోఏలపై కక్ష కట్టిందని విమర్శించారు. మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించి అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో వీవోఏలకు సంబంధించి మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ ఉన్నప్పటికీ సీఐటీయూ పోరాట ఫలితంగా అమలు చేయలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేన్సర్‌పై అవగాహన ర్యాలీలు



కృష్ణాదేవిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

నర్సీపట్నం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్‌పై అవగాహన ర్యాలీలను గురువారం వివిధ మండలాల్లో నిర్వహించారు. నర్సీపట్నం మండలం వేములపూడిలో పీహెచ్‌సీ వైద్యాధికారిణులు డాక్టర్ సుమ, డాక్టర్ అనూష ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎటువంటి కేన్సర్‌నైనా తొలిదశలో గుర్తిస్తే 98శాతం ప్రాణాలను కాపాడే అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు పైబడిన వారందరికీ ఇంటివద్దే క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండల కేంద్రం గొలుగొండ, చీడిగుమ్మల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ ధనుంజయ్, మధుసూదన్, సీహెచ్‌వో ప్రసాద్, హెచ్‌వో అరుణకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కృష్ణాదేవిపేటతో పాటు కొంగసింగిలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీలు నిర్వహించారు వైద్యాధికారులు డాక్టర్ హరిప్రవీణ్, గాయత్రిలు క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, అదనపు పిన్సిపాల్ రుత్తల గంగ రాజు, పీహెచ్‌ఎన్ సావిత్రి, హెచ్‌వీ వరలక్ష్మి, అధ్యాపకులు, వైద్య సిబ్బంది తదితర పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంటును ప్రతిఘటిస్తాం



నగరం పాలెంలో విల్లంబులతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) హైడ్రో పవర్ ప్లాంటుకు ప్రభుత్వం అనుమతులు తీ ప్రస్థాయిలో ప్రతిఘటిస్తామమని గిరిజనులు హెచ్చరించారు. ఈ మేరకు విల్లంబులు చేతపట్టి గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. మండలంలోని వాలాబు శివారు నగరంపాలెం వద్ద హైడ్రో పవర్ ప్లాంటు నిర్మించ తలపెట్టిన ప్రదేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర ఆధ్వర్యంలో ఈ ఆందోళన కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం అటవీశాఖ అధికారులు, అదానీ కంపెనీ సిబ్బంది రహస్యంగా సర్వే నిర్వహించడం తగదన్నారు. ఇలాంటి ప్రాజెక్టుల వల్ల అటవీ ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. దీనికి వ్యతిరేకంగా పార్టీలకు అతీతంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజనంలో కరివేపాకు బదులు వేపాకు

నిర్వాహకులకు ఎంఈవో మందలింపు

రోలుగుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.నాయుడుపాలెం జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 4న సోమవారం మెనూ ప్రకారం బిర్యానీ, ఎగ్ కర్రి వండి విద్యార్థులకు అందించాల్సి ఉంది. కానీ, వంట చేసే సమయంలో ఎగ్ కర్రీలో కరివేపాకు బదులు వేపాకు వేసి వండి వడ్డించారు. దీంతో ఎగ్ కర్రి అంతా చేదుగా మారడంతో విద్యార్థులు ఆ రోజు మధ్యాహ్నం భోజనాలు తినకుండా బయటపడేశారు. ఈ ఘటన పిల్లలు తల్లిదండ్రులకు తెలపడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఫిర్యాదు మేరకు గురువారం ఎంఈఓ జగ్గారావు పాఠశాలలో విచారణ చేపట్టారు. వంట నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మందలించారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



రావికమతంలో సభ్యత్వ నమోదు చేస్తున్న నేతలు

రావికమతం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రావికమతంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సర్పంచ్ గంజి మంగ మోదునాయుడు మాట్లాడుతూ ,టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారందరికీ పార్టీ వెళ్లవేళలా అండగా ఉంటుందన్నారు. పార్టీ మండల అధ్యక్షులు గంజి ఈశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల తెలుగు యుత అధ్యక్షుడు ఉప్పలూరి నాగేశ్వరావు,7వ వార్డు వార్డు మెంబరు దండుపాటి నాగరాజు, గల్లా నానిబాబు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల సిబ్బంది పనితీరు పరిశీలన

మాడుగుల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాలంపల్లి, లోవపొన్నవోలు గ్రామ పంచాయతీల్లో సిబ్బంది పనితీరుని ఎంపీడీవో కొంకి అప్పారావు గురువారం పరిశీలించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గతంలో జాలంపల్లిలో డయేరియా సమస్యతో మూసివేసిన చేతిబోరుని అందుబాటులో తేవాలని సిబ్బందికి సూచించారు. గొప్పులపాలెంలో అసంపూర్తిగా నిలిచిపోయిన హౌసింగ్ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులకు బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రధాన పట్టణాల్లో రైతుబజార్ల ఏర్పాటుకు కృషి

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



రైతులకు గుర్తింపు కార్డులందజేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విశాఖ, అనకాపల్లి జిల్లాలో ఉన్న ప్రధాన పట్టణాల్లో కొత్తగా రైతు బజార్లు ఏర్పాటుకు కృషి చేస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం మండలంలో మర్రివలసలో కూరగాయలు పండించే రైతులకు రైతుబజారు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె. కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ మండలం నుంచి అధిక సంఖ్యలో రైతులు కూరగాయలు పండిస్తున్నారని, వారికి సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కె. కోటపాడు మండలంలోని రైతులు మాత్రం కూరగాయలు రవాణా చేయలేక దళారులు చేతిలో మోసపోతున్నారన్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని కూరగాయలు నిల్వకు ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయడమే కాకుండా అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి తదితర చోట్ల రైతు బజార్లు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. మార్కెటింగ్ శాఖ ఏడీ షేక్‌యాసిన్ మాట్లాడుతూ రైతు బజార్ కార్డుల కోసం 637 దరఖాస్తులు వచ్చాయన్నారు. మాడుగుల నియోజకవర్గానికి 135 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, ఉమ్మడి జిల్లా సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు, జూరెడ్డి రాము, బీజేపీ మండల ప్రెసిడెంట్ కోటాన ఈశ్వరరావు, నాయకులు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ చల్లా సత్యనారాయణ, నరసింహనాయుడు, బండారు ప్రసాద్, బండారు లక్ష్మణరావు, పూడి నారాయణమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



చీడికాడలో డీటీకి వినతి పత్రమిస్తున్న వీవోఏలు

చీడికాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వీవోఏలతో కలిసి గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.అనంతరంవినతిపత్రాన్ని డీటీ సత్యనారాయణ, ఏపీఎంకి అందజేశారు.

మాడుగుల: వెలుగు శాఖలో గత 15ఏళ్లుగాపనిచేస్తున్న వీవోఏలు కుటుంబాలతో రోడ్డున పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంఘ నాయకులు కోరారు. స్థానిక ఎంపీడీవో కొంకి అప్పారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.జగదీశ్వరి, కె.దేవి, మాధవి, వి.జగదీశ్వరి, అరుణ, విజయ, వెంకటలక్ష్మి, అశ్విని పాల్గొన్నారు.

రావికమతం: వేతన బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్‌తో వెలుగు విఓఏలు డిమాండ్‌తో స్థానిక వెలుగు కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. వీవోఏలు గంజి సత్యవతి, పుష్పలక్ష్మి, మంగ, టి.ఈశ్వరరావు, ఎస్. ప్రసాద్,రమణ పాల్గొన్నారు.

'రుణాల మంజూరులో ఇబ్బంది కల్పించొద్దు'



మాట్లాడుతున్న మేనేజర్ సత్యనారాయణ

కె.కోటపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుణాలు మంజూరులో బ్యాంకు మేనేజర్లు లబ్ధిదారులను ఎటువంటి ఇబ్బందులకు గురిచేయకుండా లక్ష్యం పూర్తి చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ కె. సత్యనారాయణ ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో నిర్వహించిన జాయింట్ మండల లెవల్ బ్యాంకర్ల కమిటీ సమావేశంలో మాట్లాడారు. సకాలంలో చెల్లిస్తున్న మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. చిన్న వ్యాపారులకు ముద్ర రుణాలు విరివిగా అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ ప్రాజెక్టు మేనేజర్ కె. కుమారస్వామి, మండల పరిషత్ ఈవో అప్పలరాజు, ఎస్‌బీఐ ప్రతినిధి బి. విజయ్‌కుమార్, ఇండస్ట్రియల్ ప్రమోషనల్ ఆఫీసర్ ఎస్. త్రివేణి, కె.కోటపాడు ఎస్‌బీఐ హరికృష్ణ పాల్గొన్నారు.

వికసిత భారత్ ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం

ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు



బుచ్చెయ్యపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వికసిత భరత్ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ కార్పరేషన్ చైర్మన్ తాతయ్యబాబు అన్నారు. వడ్డాదిలో గురువారం జరిగిన విలేకరుల సమాశేంలో మాట్లాడారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఐదు నెలల్లో ప్రజాదరణ పొందిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎం జగన్ ఏపీలో అన్ని రంగాల్లో తిరోగమనంలోనికి నెట్టారని ఆరోపించారు. వైద్యం, విద్య వ్యవసాయం రంగాలను భ్రష్టు పరిచారని మండి పడ్డారు. ఈ స్థితిలో అధికారంలోకి వచ్చిన సీఎం చం ద్రబాబు పాలనలో పురోగమనంలో పయనింపజేస్తున్నారు.మహిళలపై సోషల్ మీడియాలో కొందరు ఇష్టానుసారంగా మాట్లాడటం తగదని అన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా రూపొందాలి



పారిశ్రామిక ప్రదర్శనలో విద్యాసంస్థల చైర్మన్ రమణాజీ

చోడవరం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేదిశగా అడుగులు వేయాలని స్థానిక ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జె. రమణాజీ పిలుపునిచ్చారు.గురువారం ఉషోదయ కాలేజీలో మేనేజ్‌మెంట్ కామర్స్ విద్యార్థులతో బిట్ 2కె 4 పేరిట పారిశ్రామిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ ప్రాజెక్టులకు సంబంధించి స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ వెంకట వాసు, ప్రిన్సిపాల్ నాయుడు కో ఆర్డినేటర్ దొరబాబు పాల్గొన్నారు.

సమాచార చట్టంపై రైతులకు అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీదేవి

దేవరాపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పౌర సమాచార హక్కు చట్టంపై ప్రతి రైతుకు అవగాహన అవసరమని ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ అధ్యక్షతన అవగాహన కార్య క్రమం నిర్వహించారు. ఏవో కాంతమ్మ మాట్లాడుతూ సమాచారం అడిగిన వారికి 30 రోజులలో కచ్చితంగా సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి కార్యాలయంలో సమా చార హక్కు చట్టం వివరాలతో బోర్డులు పెట్టాలలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రిసత్యం, విస్తరణ అధికారి కిరణ్‌కుమార్, సర్పంచ్ పెంటమ్మ రైతులు పాల్గొన్నారు.

చోడవరం: సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసిన వారికి సమాచారం ఇవ్వాలని వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రనాథ్ రైతు సేవాకేంద్రం ఇన్‌చార్జిలకు సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతుసేవా కేంద్రాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలోఏవో పావని, ఏఈవో కిరణ్, ఉద్యాన సహాయకులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

రోలుగుంట: సమాచార హక్కు చట్టంపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఏడీఏ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచర హక్కు చట్టం - 2005పై రైతులకు, మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీఓ వీఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ ద్వారా 68 వేల కుళాయి కనెక్షన్లు

దేవరాపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొత్తపల్లి, వాలాబు, దేవరాపల్లి గ్రామాల్లో ఇంటింట కొళాయిలను ఆర్.డబ్ల్యూఎస్. డీఈఈ జి.వి.ఎస్. ప్రకాష్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలో రూ. 171 కోట్లతో 68,036 కుటుంబాలకు ఇంటింటి కొళాయి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 44,664 కుటుంబాలకు ఇంటింటి కొళాయి సౌకర్యం కల్పించామన్నారు. మిగిలిన 23372 కొళాయిల పనులు సాగుతున్నాయన్నారు. ఈపనులు పూర్తయితే 316 గ్రామాలకు తాగునీటి సౌకర్యం కలుగుతుందన్నారు. ఈయన వెంట ఏఈఈ చంద్రశేఖరు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

దేవరాపల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు గురువారం మొక్కలు నాటారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి కొండలరావు ఈసందర్భంగా కోరారు. ఉపాధ్యాయులు పసిమల్లా, ఉమామహేశ్వరి, ఎస్.శ్రీనివాస్, కొటాన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళికలో ముందంజలో ఉండాలి

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం అమలుచేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలు ముందంజలో ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఆదేశించారు. గురువారం జగదాంబ జంక్షన్‌లోని జీవీఎంసీ జోనల్ 4 కార్యాలయంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న పథకమన్నారు. నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఈ విషయంలో కాంట్రాక్టర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా సాధ్యమైనన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్లు చేసిన ఫిర్యాదుపై స్పందిస్తూ, నిర్మాణాలు చేపట్టిన ఇళ్లకు జియో ట్యాగింగ్ ప్రక్రియ కొనసాగుతున్నందున త్వరలో బిల్లులు విడుదల చేస్తారన్నారు. సమీక్షలో సంస్థ చీఫ్ ఇంజనీరు జీవీ.ప్రసాద్, విశాఖ, అనకాపల్లి జిల్లాల పీడీలు ఆళ్ల శ్రీనివాసరావు, శ్రీనివాస్, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు. తొలుత సబ్బవరం మండలం గొల్లలపాలెం, తదితర లేఅవుట్‌లను సందర్శించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి హాకీ పోటీలు


రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు సిద్ధమైన నక్కపల్లి హాకీ మైదానం

నక్కపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ అండర్-14 రాష్ట్ర హాకీ టోర్నమెంట్, సెలక్షన్స్ శుక్రవారం ఉదయం నుంచి నక్కపల్లిలో జరగనున్నాయి. దీనికి సంబంధించి ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. స్థానిక బీఎస్ హాకీ క్లబ్ మైదానంలో 8 నుంచి 10వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని ఎంఈవోలు నరేశ్, వి.నూకరాజు చెప్పారు. ఈ మేరకు గురువారం నక్కపల్లి హైస్కూల్‌లో పలు ప్రాంతాల నుంచి హాజరైన వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి 468 మంది బాలబాలికలు, కోచ్‌లు, మేనేజర్లు టోర్నమెంట్‌కు వస్తారని ఎంఈవోలు చెప్పారు. రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని, అదే విధంగా రాష్ట్ర స్థాయిలో హాకీ జట్ల ఎంపికలు కూడా జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు. ఈ సమావేశంలో హైస్కూల్ హెచ్‌ఎం రాణీలలిత, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి కె.ఎం నాయుడు, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ నాగేశ్వరరావు, బీఎస్ హాకీ క్లబ్ సెక్రటరీ కొల్నాటి తాతాజీ పాల్గొన్నారు.

ముందస్తు హెచ్‌పీవీ టీకాలతో కేన్సర్ నివారణ


పెదరాంభద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాలు వేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కేన్సర్‌పై అవగాహన, ముందస్తు హెచ్‌పీవీ టీకాలతో కేన్సర్ వ్యాధిని నివారించవచ్చని ప్రముఖ అంకాలజీ వైద్య నిపుణులు డి.రఘునాథరావు, డి.లీల తెలిపారు. అమెరికాకు చెందిన మానవసేవ, దిగుమర్తి ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో మండలంలోని పెదరాంభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది విద్యార్థులకు ఉచితంగా హెచ్‌పీవీ రెండవ డోసు కేన్సర్ నిరోధక టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫామ్‌లో ఇంజనీర్

ఉద్యోగం వదిలి కోళ్ల పెంపకం చేపట్టిన యువకుడు

- సొంతూరిలో మూడు ఎకరాల్లో ఫామ్ ఏర్పాటు
- ఒక్కో కోడి పుంజు రూ.10 వేలు నుంచి రూ.30 వేల వరకు విక్రయం
- నెలకు రూ.80 వేలకుపైగా ఆదాయం



కోళ్లకు మేత వేస్తున్న యువ ఇంజనీర్

ఉన్నత చదువు చదువుకుని మంచి ఉద్యోగంలో స్థిరపడాలని భావించే ఈ రోజుల్లో సొంతూరిలో స్వశక్తితో ఎదుగుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఓ యువ ఇంజనీర్. ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా సుమారు రూ.30 లక్షలతో కోళ్ల పెంపకం ప్రారంభించి నాటు కోళ్లను పెంచుతూ నెలకు రూ.80 వేల ఆదాయం పొందుతున్నాడు.

- మాకవరపాలెం-ఆంధ్రజ్యోతి


పలు జాతులకు చెందిన కోళ్లు

మాకవరపాలెం గ్రామానికి చెందిన వడ్లమూడి బాలాజీకుమార్ సివిల్ ఇంజనీరింగ్ చదివాడు. 2008 సంవత్సరం నుంచి విజయవాడలో ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేశాడు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ కంపెనీ మూతపడింది. దీంతో స్వగ్రామానికి వచ్చేశాడు. తన వద్ద ఉన్న డబ్బులతో పీపీ అగ్రహారం రోడ్డులో మూడు ఎకరాల మెట్ట భూమిని కొనుగోలు చేశాడు. తనకు వచ్చిన ఆలోచనను స్నేహితులతో పంచుకున్నాడు. వారి సహాయంతో రెండేళ్ల క్రితం ఆ భూమిలో విజయ్ క్లో ఫామ్ ఏర్పాటుచేశాడు. ముందుగా పలు జాతులకు చెందిన కోళ్లను తూర్పుగోదావరి జిల్లా నుంచి తీసుకువచ్చాడు. అనంతరం తన సొంత ఫామ్‌లోనే రూ2 లక్షలతో కోడిగుడ్లను పొదిగే విద్యుత్ యంత్రాన్ని ఏర్పాటుచేశాడు. ఈ యంత్రం ద్వారా 21 రోజుల్లోనే గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. అనంతరం వాటిని పది రోజుల వరకు విద్యుత్ కాంతులు ఉన్న చోట ఉంచి తరువాత కోడిపెట్టల వద్ద వదులుతున్నారు.


పొదిగిన కోడిపిల్లలను ఒక తొట్టెలో ఉంచిన దృశ్యం


కోడి పిల్లలను పొదిగే విద్యుత్ యంత్రం

ఇలా ఇప్పటికే అతని కోళ్లఫామ్‌లో పలు జాతులకు చెందిన 700 కోళ్లు ఉన్నాయి. ఒక్కొక్క కోడిపుంజు రూ.10 వేలు నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. వీటిని భీమవరం, రాజమహేంద్ర వరం, తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతవాసులతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల వాసులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే 70 పందెం కోళ్లను విక్రయించారు. అలాగే జాతి కోడిగుడ్డు రూ.300, ఒకరోజు జాతి కోడి పిల్ల రూ.400, నెల రోజుల కోడి పిల్ల రూ.700 చొప్పున విక్రయిస్తున్నారు. వీటిని చాలామంది కొనుగోలు చేసి పందేల కోసం సిద్ధం చేస్తున్నారు. ఈ ఫామ్ ద్వారా నెలకు సుమారు రూ.80 వేల ఆదాయం వస్తుంది.

ఆదాయం బాగుంది

సివిల్ ఇంజనీర్ ఉద్యోగం కంటే కోళ్ల ఫామ్ వ్యాపారం బాగుంది. రోజూ కోళ్లఫామ్‌లో కష్టపడి పనిచేయడంతో ఆరోగ్యం కూడా బాగుంది. ఎంతో టెన్షన్‌తో ఉద్యోగం చేసేవాడిని. ఇప్పుడు కోళ్ల ఫామ్‌లో సంతోషంతో పాటు నలుగురికి పని కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. జాతి పుంజులు కావాలని ఇతర జిల్లాల నుంచి ఫోన్లు చేస్తుంటారు. భవిష్యత్తులో గొర్రెల ఫామ్ ఏర్పాటుచేసే ఆలోచన ఉంది.

- వడ్లపూడి బాలాజీకుమార్

రీసర్వే అభ్యంతరాలపై విచారణ చేపట్టండి

» కలెక్టర్ విజయకృష్ణన్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ గ్రామసభలు, రీసర్వే అభ్యంతరాలపై వచ్చిన అర్జీలపై పూర్తి విచారణ చేసి పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశమందిరంలో రెవెన్యూ, ఎక్సైజ్, మైన్స్ శాఖలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన అర్జీలపై సంపూర్ణ అవగాహన, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఆచరణతోనే సమస్య పరిష్కారం సులభం అవుతుందని తహసీల్దార్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యల పరిష్కారానికి సిబ్బందికి తగిన సూచనలు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. రీసర్వే అభ్యంతరాలపై రోజువారీ నివేదికలు సిద్ధం చేసుకోవాలని, నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామసభల్లో ప్రత్యేక సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. అనంతరం గనులశాఖ అధికారులతో సమీక్ష చేస్తూ గనుల కేటాయింపునకు సంబంధించిన దరఖాస్తులపై సమీక్ష చేశారు. జిల్లాలో లభ్యమవుతున్న లేటరైట్, క్లే, కలర్ గ్రానైట్, గ్రావెల్ గనులకు సంబంధించి అనుమతులు మంజూరుకు పెండింగ్ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గనుల అక్రమ తవ్వకాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన లిక్కర్ పాలసీని సక్రమంగా అమలు చేయాలన్నారు. మద్యం షాపులపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బడి, గుడికి దగ్గరగా షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బెల్టుషాపులు నిర్వహించకుండా అరికట్టాలని, అందుకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డీఆర్‌ఓ దయానిధి, ఆర్డీవో షేక్ ఆయిషా, రెవెన్యూ, మైనింగ్, ఎక్సైజ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు : జేసీ


మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ దీపం పథకం-2 కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తుందని జేసీ జాహ్నవి తెలిపారు. గురువారం కలెక్టరేట్ చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ పథకాన్ని అక్టోబరు 31వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందన్నారు. గ్యాస్ సిలిండర్ ధర కూటమి ప్రభుత్వం భరించి లబ్ధిదారులకు ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. జిల్లాలో ఇది వరకు అర్హులైన దీపం, ఉజ్వల-1, 2, సీఎస్ఆర్(శ్రీ), జనరల్ వారందరికీ, తెల్ల రేషన్ కార్డు, బుకింగ్ చేసుకున్న గ్యాస్ కనెక్షన్, ఆధార్‌కార్డు, గ్యాస్ వినియోగదారునితో అనుసంధానమైన బ్యాంక్ ఖాతా గల వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఈకేవైసీ పూర్తి కాని వారు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గ్యాస్ సిలిండర్ ఇంటికి తెచ్చినప్పుడు డెలివరీ బాయ్ ఉచితంగా మీ ఇంటి వద్దనే ఈకేవైసీ పూర్తి చేస్తాడని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలోని ఆయిల్, గ్యాస్ కంపెనీల ద్వారా నవంబరు ఆరో తేదీ వరకు 61,838 లబ్ధిదారులు గ్యాస్ బుక్ చేసుకోగా, ఇందులో 50 శాతం అంటే 31,168 మందికి ఉచితంగా గ్యాస్ సరఫరా చేసినట్టు తెలిపారు. ఈ పథకంపై ఎటువంటి సందేహాలు ఉన్నా టోల్‌ఫ్రీ నంబరు 1967ను సంప్రతించాలని ఆమె సూచించారు.

అడ్డగోలుగా గ్రావెల్, మట్టి తవ్వకాలు

... 5వ పేజీ తరువాయి

సమీపంలోని రియల్ ఎస్టేట్ వెంచర్‌కు తరలిస్తున్నారు.

మొక్కుబడి చర్యలు

ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వకాలపై పోలీసు, రెవెన్యూ, గనుల శాఖల అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మొక్కుబడిగా దాడులు నిర్వహించి గ్రావెల్ తరలిస్తూ ట్రాక్టర్లు, లారీలు పట్టుబడితే అరకొరగా జరిమానా విధించి వదిలేస్తున్నారు. ఒకవేళ్ల రాత్రి గస్తీ పోలీసులు గ్రావెల్ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుంటే... స్థానిక నేతల ఒత్తిళ్లతో మొక్కుబడిగా జరిమానా విధించి, తమ వాటా సొమ్ము తీసుకుని వాహనాలను విడిచిపెట్టేస్తున్నారు. ఇటువంటి సంఘటనలు అనకాపల్లి, సబ్బవరం, అచ్యుతాపురం, పరవాడ మండలాల పరిధిలో అధికంగా జరుగుతున్నాయి.

తవ్వకాలకు అనుమతి లేదు

కొప్పాకలోని ఏపీఐఐసీ ప్రాంగణంలో గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని జిల్లా గనుల శాఖ అధికారి మజ్జి శ్రీనివాస్ తెలిపారు. మార్టూరులో కూడా ప్రత్యేకంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలకు అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు.

మూన్నాళ్ల ముచ్చటే!

... 5వ పేజీ తరువాయి

భారీ వాహనాల్లో తీసుకువస్తుంటారు. గత ప్రభుత్వం ఈ రోడ్డు గురించి పట్టించుకోకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. అచ్యుతాపురం- అనకాపల్లి మధ్య 13 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి గంటన్నర సమయం పట్టేది. రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో అప్పట్లో వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత వచ్చింది. దీంతో ఎన్నికల్లో ఇబ్బంది పడతామని భావించిన వైసీపీ పాలకులు... ఎన్నికల ముందు మొక్కుబడిగా రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. హడావుడిగా, నాణ్యతాలోపంతో, నాసిరకంగా పనులు చేయడంతో పరిస్థితి మూన్నాళ్ల ముచ్చటగా తయారైంది. ప్యాచ్ వర్క్ చేసిన ప్రదేశాల్లో భారీ వాహనాల రాకపోకలతో మళ్లీ గతుకులు ఏర్పడుతున్నాయి. మునగపాక వద్ద 15 రోజుల క్రితం కొత్తగా బీటీ లేయర్ వేశారు. ఇక్కడ భారీ వాహనాల వల్ల రోడ్డు కుంగిపోయింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, మరమ్మతు పనులను పటిష్టంగా చేయాలని ఈ మార్గంలో ప్రయాణించే పలు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్నారుల ప్రాణాలకు ముప్పు

... 5వ పేజీ తరువాయి

ఎన్నికలు జరిగి వైసీపీ ప్రభుత్వం దిగిపోయింది. జూన్ రెండో వారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇదే సమయంలో 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యింది. కానీ ఏఎల్ పురం ఉన్నత పాఠశాల అదనపు భవనాలకు కిటికీలు, తలుపులు బిగించలేదు. బెంచీలు సైతం రాలేదు. నాలుగు తరగతుల విద్యార్థులు నేలపైనే కూర్చుని చదువులు కొనసాగించాల్సి వస్తున్నది. కాగా కిటికీలు బిగించకపోవడంతో విద్యార్థులు వాటిల్లో నుంచి కిందకు తొంగిచూస్తున్నారు. ఈ క్రమంలో జరగరానిది జరిగి, విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే ఎవరు బాధ్యత వహిరని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పేరుతో ఆర్భాటం చేసిందే తప్ప.. పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యా శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఏఎల్‌పురం ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనాల పనులు పూర్తి చేయించి, బెంచీలు సమకూర్చాలని కోరుతున్నారు.

అసంపూర్తి భవనాలకు కదలిక

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్ల అవతారమెత్తి భవన నిర్మాణ పనులు చేపట్టారు. పనులు పూర్తి చేయకపోయినప్పటికీ అధికారులపై ఒత్తిడి తెచ్చి బిల్లులు మంజూరు చేయించుకున్నారు. దీంతో భవన నిర్మాణాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. జిల్లాలో మొత్తం 820 భవనాలకుగాను ఇంతవరకు 480 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 340 భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో అసంపూర్తిగా వున్న ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు గ్రామాల్లో అసంపూర్తి వున్న భవన నిర్మాణాల వివరాలు సేకరిస్తున్నారు. ఏ భవనానికి ఎంత ఖర్చు చేశారు, ఇంకా చెల్లించాల్సింది ఎంత, పనుల స్థితిగతులపై సమగ్ర నివేదిక రూపొందించే పనిలో వున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

అసంపూర్తి భవన నిర్మాణాల గురించి పీఆర్ ఇంజనీరింగ్ అధికారి వీరన్నాయుడు వద్ద ప్రస్తావించగా, పనులు నిలిచిన గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల వివరాలను సేకరిస్తున్నట్టు తెలిపారు. భవన నిర్మాణాల స్థితిగతులపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయగానే భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సింహాద్రి (ఫైల్)

సబ్బవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారి చిన్నయ్యపాలెం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక ఎస్ఐ పి.దివ్య తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జిల్లాలోని కోటవురట్ల మండలం రాట్నవానిపాలేనికి చెందిన మానేపల్లి సింహాద్రి(21) గురువారం ఉదయం విజయనగరం జిల్లా కొత్తవలసకు బైక్‌పై బయలుదేరాడు. అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డులో వెళుతుండగా చిన్నయ్యపాలెం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో సింహాద్రికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పి.దివ్య తెలిపారు. ఆ యువకుడు ఇంటర్ చదివి ఖాళీగా ఉంటున్నట్టు తెలిసింది.

వ్యక్తిపై కత్తితో దాడి

నర్సీపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడు వార్డు పరిధి ఎస్సీ కాలనీకి చెందిన దుద్దపూడి రాజుపై గురువారం ఉదయం ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేశారని, బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ గోవిందరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా వున్నాయి. నర్సీపట్నంలోని మూడో వార్డులో నివాసం వుంటున్న దుద్దపూడి రాజు, శారదా నగర్‌లోని శ్రీనివాస వ్యాన్ యూనియన్ ఆఫీసులో గుమస్తాగా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో యూనియన్ ఆఫీసు యజమాని కర్రి శ్రీనివాసరావుతో కలిసి వెళుతుండగా సుబ్రహ్మణ్యస్వామి గుడి వద్ద పప్పు నాయుడు, నవీన్ అలియాస్ మసాలా అనే వ్యక్తులు కత్తితో దాడిచేశారు. దీంతో శరీరంపై పలుచోట్ల గాయాలు అయ్యాయి. ఆకస్మిక దాడితో భయాందోళన చెందిన రాజు, శ్రీనివాసరావు.. వారి నుంచి తప్పించుకొని చికిత్స కోసం ఏరియా ఆస్పత్రి వెళ్లారు. ఈ సంఘటనపై రాజు భార్య దుద్దపూడి కనక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంఎల్‌సీ కేసుగా ఏరియా ఆస్పత్రి నుంచి సమాచారం రావడంతో ఆస్పత్రికి వెళ్లి రాజు నుంచి వాగ్మూలం తీసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ గోవిందరావు తెలిపారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దుద్దపూడి రాజును మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ పరామర్శించారు.

మత్స్యగెడ్డలో గల్లంతైన గిరిజనుడు మృతి


మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో సుజనకోట పంచాయతీ గొడుగులపుట్టు వద్ద మత్స్యగెడ్డలో బుధవారం గల్లంతైన గిరిజనుడు సొంబ్రన్న (49) మృతిచెందాడు. ఇతను నాటు పడవపై చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మత్స్యగెడ్డలోపడి గల్లంతైన విషయం తెలిసిందే. ఎస్ఐ జె.రామకృష్ణ, సర్పంచ్ వి.రమేశ్.. నాటుపడవల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం మృతదేహం బయటపడడంతో ఒడ్డుకు చేర్చారు. ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి

చీడికాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కోనాం పంచాయతీ బందవీధికి చెందిన కొర్రా గణపతి (23) గురువారం సాయంత్రం మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపతి సోమవారం ఉదయం మాడుగుల నుంచి బైక్‌పై ఖండివరం వస్తున్నాడు. కింతలి వల్లాపురానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌తో బలంగా ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన గణపతిని కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందినట్టు గణపతి సోదరుడు యోహాన్ తెలిపారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మాడుగుల ఎస్ఐ నారాయణరావు తెలిపారు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్ప గిస్తామని ఆయన చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554